1st Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
RNI : APTEL / 2023 / 89152
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 2 సంచిక : 235 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 24 జూలై 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 235 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 24 July 2025 PAGES : 8 PRICE : 3/-

## కోసేస్తాం.. నరికేస్తాం.. అంటే చేతులు కట్టుకుని కూర్చోం

వైకాపావాళ్ల తాటాకు చప్పుళ్లకు బెదిరేవాళ్లెవరూ లేరిక్కడ

సినిమాలు చేస్తున్నానని నన్ను విమర్శిస్తారా?

వాళ్లలా నాకు పత్రికలు, టీవీలు, సిమెంట్ ఫ్యాక్టరీలు, బినామీ వ్యాపారాలు లేవు

వైకాపా నేతలపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మండిపాటు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 23)
'వైకాపా నాయకులు కోసేస్తాం, నరికేస్తాం అంటే ఇక్కడెవరూ చేతులు కట్టుకుని కూర్చోరు కదా! అలా మాట్లాడడం, బెదిరించడం వాళ్ల నైజం.. అవన్నీ ఎదుర్కొని నిలబడ్డాం కాబట్టే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగాం. వాళ్లవన్నీ తాటాకు చప్పుళ్లు' అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. వైకాపా నాయకులు మద్య నిషేధం చేస్తామని అధికారంలోకి వచ్చి.. మద్యం కుంభకోణంలో రూ.వేల కోట్లు దోచుకున్నారని, కల్తీ మద్యంతో అనేకమంది బతుకుల్ని ఛిద్రం చేశారని ధ్వజమెత్తారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ కేసులు

# విశాఖకు నాలుగు ప్రతిష్ఠాత్మక సంస్థలు..

## ఎస్ఐపీబీ ఆమోదం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 23)
ఏపీలో రూ. 20వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 4 కంపెనీల ఏర్పాటుకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ) ఆమోదం తెలిపింది. ఈ కంపెనీల ద్వారా 50వేల మందికి పైగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ భేటీ జరిగింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. భవిష్యత్తు పెట్టుబడులు, అవసరాలకు తగ్గట్లుగా విశాఖ మాస్టర్ ప్లాన్ ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతిష్ఠాత్మక సంస్థల రాకతో విశాఖ ఇమేజ్ పెరుగుతుందని మంత్రి నారా లోకేశ్ అభిప్రాయపడ్డారు.

రాష్ట్రంలో రూ. 16,466 కోట్లతో సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ సంస్థ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. విశాఖపట్నంలో మొదటిదశలో ఆ సంస్థ రూ. 1,466 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీంతో 200 మందికి ఉపాధి లభించనుంది. రెండో దశలో 15,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుండగా 400 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. విశాఖపట్నంలోని మధురవాడలో

## తదుపరి ఉప రాష్ట్రపతి ఎవరో..? రేసులో నీతీశ్, శశిథరూర్..




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 23)
పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఆయన వైదొలగడంతో ఇప్పుడు తదుపరి ఉప రాష్ట్రపతిగా ఎవరిని ఎంపిక చేస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ఈక్రమంలోనే తెర పైకి పలువురి పేర్లు వచ్చాయి. అందులో బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పేరు కూడా ఉండటం గమనార్హం.

**బిహార్ ఎన్నికల వేళ..**

మరికొన్ని నెలల్లో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ రాష్ట్రానికి కొన్నేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న నీతీశ్ కుమార్ ఇకనైనా ఆ కుర్చీని వీడి కొత్త తరానికి అవకాశం ఇవ్వాలని ఎన్డీయే కూటమిలో పలువురు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో జేడీయూ కూడా ఎన్డీయే కూటమితో కలిసే బరిలోకి దిగనుంది. దీంతో నీతీశ్‌ను తప్పించి మరో నాయకుడికి రాష్ట్ర పగ్గాలు అప్పగించాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే జగదీప్ ధన్‌ఖడ్ స్థానంలో బిహార్ ముఖ్యమంత్రికి ఉప రాష్ట్రపతి పదవి కల్పించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అదే జరిగితే.. బిహార్‌లో ముఖ్యమంత్రి పదవి భాజపాకు దక్కనున్నట్లు సమాచారం. జేడీయూకు ఉప ముఖ్యమంత్రి పదవిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. నీతీశ్ కుమార్ కుమారుడు నిషాంత్ డిప్యూటీ సీఎం అయ్యే అవకాశాలున్నాయి.

**శశిథరూర్‌ను తీసుకొస్తారా..?**

కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తూ కాంగ్రెస్‌కు క్రమంగా దూరమవుతున్నారు సీనియర్

## నారా లోకేశ్ చొరవతో... విశాఖకు పెట్టుబడుల వెల్లువ!

చంద్రబాబు అధ్యక్షతన 9వ ఎస్ఐపీబీ సమావేశం

నాలుగు భారీ ప్రాజెక్టులకు ఆమోదం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 23)
ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో రాష్ట్రానికి పేరుమోసిన కంపెనీలు వస్తున్నాయి. తద్వారా విశాఖ మహానగర రూపురేఖలు మారబోతున్నాయి. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన 9వ ఎస్ఐపీబీ (స్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డు) సమావేశంలో ఐటీ రంగంలో

## సీఎం చంద్రబాబుకు విధేయుడిని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 23)
సీఎం చంద్రబాబుకు తాను విధేయుడినని మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆయన కూర్చోమంటే కూర్చుంటా.. లేవమంటే లేస్తానని వ్యాఖ్యానించారు. విజన్ ఉన్న నాయకుడు కాబట్టే చంద్రబాబును ఫాలో అవుతూ తన ఊరిని అభివృద్ధి చేస్తున్నానని చెప్పారు. అనంతపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. డీపీవో నాగరాజు అవినీతి, తీసుకున్న లంచాల చిట్టా ఆధారాలతో సహా తన వద్ద ఉందని.. వాటిని కోర్టుకు అందజేస్తానని చెప్పారు. "నా మీద

## జెలెన్‌స్కీకి వ్యతిరేకంగా భారీ ఆందోళనలు.. ఎందుకంటే..?



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 23)
అవినీతి నిరోధక సంస్థలను బలహీనపర్చేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. ఫలితంగా ఆ దేశ రాజధాని కీవ్‌లో భారీ ఆందోళనలు మొదలయ్యాయి. ఇటీవల అధ్యక్షుడు దేశంలోని యాంటీ కరెప్షన్ బ్యూరోను బలహీన పర్చే ఓ బిల్లుపై సంతకాలు చేయడంతో అంతర్జాతీయగా తీవ్రస్థాయిలో విమర్శలు చెలరేగాయి. ఉక్రెయిన్‌లోని నేషనల్ యాంటీ కరెప్షన్ బ్యూరో (నాబు), స్పెషలైజ్డ్ యాంటీ కరెప్షన్ ప్రాసిక్యూషన్స్ ఆఫీస్ (సోపా)ను ప్రాసిక్యూటర్ జనరల్ అధీనంలోకి తీసుకొచ్చారు. దీనిని సమర్థించుకొంటూ జెలెన్‌స్కీ బుధవారం మాట్లాడారు. వీటిల్లో రష్యా ప్రభావాన్ని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అవినీతి నిరోధక వ్యవస్థల పనితీరు నాసిరకంగా ఉందని చెప్పారు. "చట్టాన్ని ఉల్లంఘించిన వారికి శిక్ష తప్పదన్న విషయాన్ని ప్రాసిక్యూటర్ జనరల్ నిర్ధరిస్తారు" అని వ్యాఖ్యానించారు. ఈ బిల్లు పాస్ అయ్యాక వేల మంది ప్రజలు కీవ్ రోడ్ల పైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. 2022లో రష్యా ఆక్రమణ చేపట్టిన తర్వాత మొట్టమొదటిసారి ఈ స్థాయిలో కీవ్‌లో నిరసనలు జరిగాయి. ల్వివ్, డెనిప్రో, ఒడెసాలో కూడా ప్రదర్శనలు చేపట్టారు. ఈసందర్భంగా ఉక్రెయిన్‌లోని ఓ ఆందోళనకారుడు బీబీసీతో మాట్లాడుతూ.. "మేము ఐరోపాను ఎంచుకొన్నాం.. అంతేకానీ నియంతను కాదు.

## వ్యవస్థలపై నిశిత విమర్శలే ధన్‌ఖడ్ ఒరవడి

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 23)
ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్‌ది వ్యవస్థలపై నిశిత విమర్శలు చేసే ధోరణి. ఆయన పలు వ్యవస్థలపై.. ముఖ్యంగా న్యాయ వ్యవస్థపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటారు. అనేక పర్యాయాలు ఆయన న్యాయ వ్యవస్థకు హద్దులు నిర్దేశించేలా మాట్లాడారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు లభ్యమైనప్పుడు ఆయన తన విమర్శలకు మరింత పదును పెట్టారు. న్యాయ వ్యవస్థలో జవాబుదారీతనం కొరవడిందంటూ తూర్పారబట్టారు. ఒకవైపు కోర్టుల్నీ, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా అవి తీసుకున్న నిర్ణయాలనూ తీవ్రంగా విమర్శిస్తూనే.. మరోవైపు ఒక న్యాయవాదిగా పని చేసిన తాను న్యాయ వ్యవస్థ కోసం పని చేస్తున్న సైనికుడిలాంటి వాడినని చెప్పుకొనేవారు. కొలీజియం వ్యవస్థను తొలగించేందుకు ఉద్దేశించిందిగా భావించిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్ చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేయడాన్ని



## పేదరికం లేని సమాజమే కోసమే పీ4 విధానం... పోస్టర్ విడుదల చేసిన మంత్రి నాదెండ్ల

ఏపీలో పేదరిక నిర్మూలనకు పీ4 కార్యక్రమం

మంత్రి నాదెండ్ల అధ్యక్షతన తెనాలి విజన్ యాక్షన్ ప్లాన్ సమావేశం

త్వరలో పీ4 వెబ్ సైట్ ప్రారంభం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 23)
ప్రపంచ దేశాలకు పెద్ద సవాలుగా మారిన పేదరికాన్ని నిర్మూలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'పీ4 -పేదరికాన్ని పారద్రోలే కార్యక్రమం' అనే సమగ్ర విధానాన్ని రూపొందించిందని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళవారం నాడు సచివాలయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగిన తెనాలి విజన్ యాక్షన్ ప్లాన్ సమావేశం అనంతరం ఆయన అధికారులతో



## భారత్ కీలక నిర్ణయం... చైనా పౌరులకు మళ్లీ పర్యాటక వీసాలు జారీ

2020లో గాల్వన్ లోయ వద్ద భారత్-చైనా బలగాల ఘర్షణలు

చైనా టూరిస్టులకు వీసాలు నిలిపివేసిన భారత్

ఇటీవల కాలంలో సత్ఫలితాలు ఇస్తున్న చర్చలు

చైనా పౌరులకు టూరిస్టు వీసాలు జారీ చేయాలని భారత్ నిర్ణయం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 23)
గాల్వన్ వద్ద 2020లో జరిగిన సరిహద్దు ఘర్షణల తర్వాత చైనా పౌరులకు పర్యాటక వీసాలను భారత్ నిలిపివేయడం తెలిసిందే. అయితే, గత కొంతకాలంగా చైనా వైఖరిలో మార్పు వచ్చింది. భారత్-చైనా మధ్య పలు చర్చలు సత్ఫలితాలను

## అసలు ఆ దేశమే లేదు.. భారత్‌లో మాత్రం ఎంబసీ..

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 23)
అసలు ఆ దేశమే లేదు.. కానీ ఎంబసీ ఏర్పాటు చేసి ఓ వ్యక్తి జాబ్ రాకెట్ నడుపుతున్నాడు . ఎవరికీ అనుమానం రాకుండా ఖరీదైన కార్లపై ఎంబసీ స్టిక్కర్లు, దౌత్య పాస్‌పోర్టులు, విదేశీ కరెన్సీ, దేశంలోని ప్రముఖ నేతలతో దిగిన నకిలీ ఫొటోలను వాడుకుంటున్నాడు. చివరకు ఉత్తర్‌ప్రదేశ్ టాస్క్ ఫోర్స్ చేతికి చిక్కాడు. జాతీయ మీడియా కథనాల ప్రకారం..

దిల్లీ ఎన్‌సీఆర్‌కు సమీపంలోని గాజియాబాద్‌లో హర్షవర్ధన్ జైన్ అనే వ్యక్తి తాజాగా పోలీసులకు దొరికిపోయాడు. ఆ నగరంలో అతడు విలాసవంతమైన రెండు అంతస్తుల ఇంటిని అద్దెకు తీసుకొని వెస్ట్‌ఆర్కిటికా పేరుతో దౌత్యకార్యాలయాన్ని నడుపుతున్నాడు. అది అంటార్కిటికాలోని ఒక ప్రాంతం. ఒక యూఎస్ నౌకాదళ అధికారి దేశంగా ప్రకటించుకున్నాడు.కానీ దీనికి ఎలాంటి గుర్తింపు లేదు. దీని పేరుతో జైన్ విదేశాల్లో పని ఇప్పిస్తానని యువతను నమ్మిస్తూ ఓ జాబ్ రాకెట్ నడుపుతున్నాడు. అలాగే మనీలాండరింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని పోలీసులు అభియోగాలు మోపారు.

యువత అతడిని నమ్మేందుకు పలు జిమ్మిక్కులు ఉపయోగించాడు. రాష్ట్రపతి, ప్రధాని, ఇతర ప్రముఖ నేతలతో దిగిన నకిలీ ఫొటోలను వాడుకున్నాడు. 2011లోనూ శాటిలైట్ ఫోన్ కలిగి ఉన్నాడని అతడిపై కేసు నమోదైంది కూడా. తాజాగా ఎంబసీ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఈ నేపథ్యంలో అతడి కార్యకలాపాలపై అనుమానం వచ్చిన పోలీసులు.. చివరకు నకిలీ ఎంబసీ గుట్టురట్టు చేశారు. వెస్ట్‌ఆర్కిటికాతో పాటు 12 మైక్రోనేషన్ల దౌత్యపాస్‌పోర్టులు, విదేశాంగ శాఖ స్టాంపులున్న



# విశాఖకు నాలుగు ప్రతిష్టాత్మక సంస్థలు..

సాత్వా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,500 కోట్ల పెట్టుబడులు పెడుతుండగా, 25,000 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ ఎండాడ (విశాఖ)లో రూ.1,250 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీంతో 15,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయి. ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ మధురవాడలో రూ.1,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. తద్వారా 10,000 ఉద్యోగావకాశాలు లభించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# కోసేస్తాం.. నరికేస్తాం.. అంటే చేతులు కట్టుకుని కూర్చోం

హఠాత్తుగా పెరగడానికి కల్తీ మద్యమే కారణమని వివరించారు. తాను నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా విడుదల సందర్భంగా మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. వైకాపా నాయకులకు అబద్ధాలు చెప్పడం, దబాయించడం అలవాటుగా మారిపోయిందని మండిపడ్డారు. 'దబాయిస్తే భయపడిపోతారను కుంటున్నారు. వ్యవస్థలు, వాటిని రక్షించే వ్యక్తులు బతికే ఉన్నారని గుర్తుపెట్టుకోవాలి' అని పేర్కొన్నారు.

### వైకాపా నాయకుల్లా నాకు దొంగ కంపెనీల్లేవు

పవన్ కల్యాణ్‌కు సినిమాల మీదున్న శ్రద్ధ, పరిపాలనపై లేదన్న వైకాపా నాయకుల విమర్శలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. 'వాళ్ల మాత్రం పత్రికలు, టీవీలు, బోలెడు బినామీ కంపెనీలు నడుపుతారు. వ్యాపారాలు చేస్తారు. అనేక ఆదాయమార్గాలు పెట్టుకుంటారు. నేను సినిమాలు మానేయాలా? వాళ్లను సిమెంట్ ఫ్యాక్టరీలు, వ్యాపారాలు మూసేయమనండి. నేను సినిమా షూటింగ్‌లు చేయడమే కనిపిస్తుంది తప్ప, వాళ్లు చేసేది కనిపించదు' అని ధ్వజమెత్తారు. 'వాళ్లలా నాకు ఆస్తులు, స్థిరాస్తి వ్యాపారాల్లో పెట్టుబడులు లేవు. తప్పనిసరి పరిస్థితుల్లో సినిమాలు చేస్తున్నాను. ఈ మూడు సినిమాలు కూడా ఎన్నికల ముందే పూర్తయ్యేవి. కానీ రాజకీయ పరిణామాలు మారిపోవడం వల్ల సమయం కుదరలేదు' అని తెలిపారు.

### రాజకీయాలు, సినిమాలు బ్యాలెన్స్ చేయలేకపోయా

'రాజకీయాలు, సినిమాలు.. ఎన్నికల ముందు బ్యాలెన్స్ చేయలేకపోయాను. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరు నెలల వరకు నాకు ఊపిరి సలపలేదు. అప్పగించిన ప్రభుత్వశాఖలపై అవగాహన పెంచుకోవడం, అధికారులను సమన్వయం చేసుకోవడానికే సరిపోయింది. అప్పటికే చాలావరకు చేసిన 'హరి హర వీరమల్లు' 20 రోజుల షూటింగ్‌తో పూర్తవుతుందని మా వాళ్లు చెప్పారు. పరిపాలనకు ఇబ్బంది లేకుండా రోజులో రెండు గంటలే షూటింగ్‌లో పాల్గొన్నా. ఆదివారం పూర్తిగా హాజరయ్యేవాణ్ని. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆంధ్రప్రదేశ్‌లో చేసిన మొదటి సినిమా ఇది' అని తెలిపారు.

### టికెట్ ధర పెంపు దస్త్రాన్ని సీఎంకు నేనే పంపాను

'వైకాపా ప్రభుత్వం నాపై కక్షతో భీమ్లా నాయక్ సినిమా టికెట్ ధర పెంచేందుకు అనుమతినివ్వలేదు. అయినా నేను అడగలేదు. ఇప్పుడు హరిహర వీరమల్లు టికెట్ ధర పెంచేందుకు అనుమతిచ్చిన తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబులకు కృతజ్ఞతలు. ఇక్కడ సినిమాటోగ్రఫీ శాఖ మా పార్టీ మంత్రి దగ్గరే ఉన్నందున.. టికెట్ ధర పెంపు దస్త్రాన్ని ఆయనకు కాకుండా నేరుగా ముఖ్యమంత్రి వద్దకు నేనే పంపాను. ఆయన నుంచే అనుమతి వచ్చింది. ఇతర సినిమాలకు ఇచ్చినట్లే నాకూ అనుమతిచ్చారు' అని పవన్ కల్యాణ్ వెల్లడించారు.

### జనసేన బలోపేతానికి కార్యాచరణ

కూటమిలోని మూడు పార్టీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, తమ పార్టీ తరఫున ఎక్కడైనా సమస్యలుంటే వ్యక్తిగతంగా చొరవ తీసుకుని పరిష్కరిస్తున్నానని పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్రంలో జనసేన బలోపేతానికి చర్యలు చేపట్టబోతున్నారా? అనే ప్రశ్నకు.. 'ఆగస్టు 15 తర్వాత కార్యాచరణ ప్రారంభిస్తాం' అని బదులిచ్చారు.

### సాయం చేయాలనే చెప్పులు పంపా

'నాకు పేరొస్తుందనో, మరో కారణంతోనో గిరిజనులకు చెప్పులు పంపలేదు. గిరిజన ప్రాంతాల పర్యటనకు వెళ్లినప్పుడు నడుస్తుంటే నా చెప్పులు జారిపోయాయి. నేను చెప్పులు వేసుకునే నడవడానికి అంత కష్టపడుతుంటే.. పెద్ద వయసు వాళ్లు చెప్పులు లేకుండా నడుస్తుండడం చూసి ఇబ్బంది అనిపించింది. సాటి మనిషికి సాయం చేయాలన్న ఉద్దేశంతో చెప్పులు పంపాను' అని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేయాలన్నది తన ఉద్దేశమన్నారు.

### ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తోంది

'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చాలా సమర్థంగా, అద్భుతంగా పనిచేస్తోంది. మొదటి తారీఖున జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు.. అధికారంలోకి వచ్చిన మా ప్రభుత్వం ఇప్పుడు ఉద్యోగులకు సకాలంలో జీతాలు, పింఛన్లు ఇస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేశాం. 20-30 ఇళ్లున్న గ్రామాలకూ రోడ్లు వేయించగలుగుతున్నాం. భారీగా పెట్టుబడులు తెస్తున్నాం. క్వాంటం వ్యాలీ ఏర్పాటు వంటి చర్యల వల్ల ఫలితాలు ఇప్పటికప్పుడు తెలియకపోవచ్చు. కానీ వచ్చే 10-15 సంవత్సరాల్లో వాటి ఫలితాలు తెలుస్తాయి' అని ఆయన పేర్కొన్నారు.

# తదుపరి ఉప రాష్ట్రపతి ఎవరో..? రేసులో నీతీశ్, శశిథరూర్..

ఎంపీ శశిథరూర్. త్వరలోనే ఆయన హస్తానికి గుడ్‌బై చెప్పి భాజపాలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం నియమించిన ఎంపీల కమిటీలో ఒకదానికి థరూర్ నేతృత్వం వహించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే తాజా రేసులో థరూర్ పేరు తెర పైకి వచ్చింది. ఆయనకు ఉప రాష్ట్రపతి పదవి ఇస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

### లెఫ్టినెంట్ గవర్నర్లకూ ఛాన్స్..

నీతీశ్‌తో పాటు మరో ఇద్దరి పేర్లు కూడా ఉప రాష్ట్రపతి పదవి రేసులో వినిపిస్తోంది. దిల్లీ, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్లలో ఒకరికి అవకాశం ఇవ్వనున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా గత మూడేళ్లుగా దిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ హయాంలో ఉన్న సమయంలో.. నియామకాల నుంచి వివాదాల వరకు నాటి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో విభేదించి తరచూ వార్తల్లో నిలిచారు. ఇటీవల జరిగిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమికి ఎల్జీతో వివాదం కూడా ఓ కారణమైంది.

దీంతో ఆయన కేంద్రం దృష్టిలో పడ్డారు. ఈక్రమంలోనే ఉప రాష్ట్రపతి పదవికి సక్సేనా వైపు మొగ్గు చూపే అవకాశాలు కన్పిస్తున్నాయి.

జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పదవీకాలం ఈ ఏడాది ఆగస్టు 6వ తేదీతో ముగియనుంది. భాజపా సీనియర్ నేత అయిన సిన్హా గతంలో ఆ పార్టీ జాతీయ కౌన్సిల్‌లో సభ్యుడిగా వ్యవహరించారు. మోదీ తొలి కేబినెట్‌లో కేంద్ర సహాయమంత్రిగా కూడా సేవలందించారు. ఆర్టికల్ 370 రద్దు అయిన ఏడాది తర్వాత జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన సిన్హా.. ఈ కేంద్రపాలిత ప్రాంతం పాలనలో తనదైన ముద్ర వేశారు. విమర్శలు, వివాదాలతో అనేక సార్లు వార్తల్లో నిలిచారు.

## మొదటి పేజీ తరువాయి

# సీఎం చంద్రబాబుకు విధేయుడిని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి

ఉన్నన్ని కేసులు ఈ రాష్ట్రంలో ఎవరి మీదా లేవు. కరోనా సమయంలో నన్ను జైలుకు పంపిస్తే వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి అప్పటి జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫోన్ చేసి ఎలాంటి సౌకర్యాలు కల్పించవద్దని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే సబ్ రిజిస్ట్రార్‌తో కుమ్మక్కై మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి ఇల్లు నిర్మించారు. తాడిపత్రిలో ఎన్నో అక్రమ లేఅవుట్లు వెలిశాయి. గత 8 నెలలుగా చాలా వినతులు డీపీవో, జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్‌కు అందజేశాం. జిల్లా జాయింట్ కలెక్టర్ చెప్పినా డీపీవో ఆ లేఅవుట్ సంగతిని పెడచెవిన పెట్టారు. ఆ విషయంపై మాట్లాడేందుకు వెళ్తే ఆయన తప్పించుకుని తిరుగుతున్నారు. మా కుటుంబం ఎప్పటి నుంచో రాజకీయాల్లోనే ఉంది. ఇప్పుడు చాలా మంది ఓవర్‌నైట్ పొలిటీషియన్లు పుట్టుకొచ్చారు. వాళ్లకు ఏమీ తెలియదు. నా ఊరి ప్రజలే.. నా దేవుళ్లు. వారి అభివృద్ధి కోసం ఎంత దూరమైనా వెళ్తా"అని జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# నారా లోకేశ్ చొరవతో... విశాఖకు పెట్టుబడుల వెల్లువ!

రూ.20,216 కోట్ల పెట్టుబడులు... 50,600 ఉద్యోగాలు కల్పించే నాలుగు భారీ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. గత ఏడాది కాలంలో మంత్రి లోకేశ్ చేస్తున్న కృషితో విశాఖ ఐటీ హబ్ గా రూపుదిద్దుకోనుంది. ఇటీవల మంత్రి లోకేశ్ బెంగుళూరు పర్యటన సందర్భంగా 35 వేల ఉద్యోగాలు కల్పించే రెండు ప్రముఖ సంస్థలతో ఒకేరోజు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆ రెండు సంస్థలకు తాజాగా జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో పచ్చజెండా ఊపారు. ఆ రోజున ఎంఓయూలు కుదుర్చుకున్న సత్వ డెవలపర్స్ సంస్థ విశాఖ మధురవాడలో రూ.1500 కోట్ల పెట్టుబడులు, 2 5 వేల ఉద్యోగాలు.. ఏఎన్ఎస్ఆర్ సంస్థ రూ.1000 కోట్ల గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ని ఏర్పాటుచేయడం ద్వారా 10 వేలమందికి ఉద్యోవగాశాలు కల్పించనుంది.

అదేవిధంగా ఎస్ఐపీబీ ఆమోదించిన మరో ప్రముఖ సంస్థ సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ విశాఖపట్నంలో డేటా సెంటర్ పై మొదటిదశలో రూ.1,466 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీనిద్వారా 200 మందికి ఉపాధి లభించనుంది. రెండవదశలో రూ.15,000 కోట్ల పెట్టుబడులు... 400 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఇదిలావుండగా విశాఖ ఎండాడలో బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1,250కోట్లతో వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఏర్పాటు చేయబోతోంది. తాజా ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ఈ సంస్థ ద్వారా 15 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

ప్రఖ్యాత ఐటీ సంస్థలైన టీసీఎస్ (12 వేల ఉద్యోగాలు), కాగ్నిజెంట్ (రూ.1,583కోట్ల పెట్టుబడి, 8 వేల ఉద్యోగాలు) త్వరలో విశాఖ కేంద్రంగా తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. గత ఏడాది కాలంగా మంత్రి లోకేశ్ అవిశ్రాంత కృషితో రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ), డేటాసెంటర్లపై లక్షకోట్లు పెట్టుబడులు పెట్టేందుకు, 95 ప్రముఖ సంస్థలు ముందుకు వచ్చాయి.

గత ఏడాది నవంబర్ లో లోకేశ్ చేసిన పెట్టుబడుల యాత్ర, జనవరిలో దావోస్ వేదికగా వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో జరిపిన చర్చలు ఫలవంతమై రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్లలో యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని సాకారం చేసేందుకు... పెట్టుబడులు, ఉపాధి కల్పన సబ్ కమిటీ ఛైర్మన్ గా మంత్రి లోకేశ్ చేస్తున్న ప్రయత్నాలు సాకారమవుతున్నాయి.

# వ్యవస్థలపై నిశిత విమర్శలే ధన్‌ఖడ్ ఒరవడి

ధన్‌ఖడ్ తీవ్రంగా విమర్శించారు.

పార్లమెంటు రెండు సభలూ ఏకగ్రీవంగా ఆమోదించిన చట్టాన్ని సుప్రీంకోర్టు ఎలా కొట్టివేయగలదని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు తీర్పుపై మౌనం దాల్చిన పార్లమెంటు సభ్యులను కూడా ఆయన అంతే తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లుల్ని రాష్ట్రపతి ఒక గడువులోగా తేల్చాలంటూ సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పును ఆయన తప్పుబట్టారు. కోర్టు సుప్రీం పార్లమెంటులా ప్రవర్తించ కూడదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య శక్తులపై సుప్రీం కోర్టు అణు బాంబును ప్రయోగించడం తగదని పేర్కొన్నారు. 'మనకు చట్టాలు చేసే జడ్జీలున్నారు. వారే కార్యనిర్వాహక కార్యకలాపాలు చేపట్టడంతోపాటు సూపర్ పార్లమెంటుగా వ్యవహరిస్తున్నారు. వారు ఎవరికీ జవాబు చెప్పాల్సిన పనిలేదు. దేశ చట్టాలు వారికి వర్తించవు' అంటూ ధన్‌ఖడ్ ఎద్దేవా చేసిన తీరు అంతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగనిది.

### అధికార మార్పునకు సంకేతం: అశ్వినీ కుమార్

రాజకీయ ప్రాధాన్యాలకు, అధికార మార్పిడులకు జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా సంకేతమని కేంద్ర న్యాయశాఖ మాజీ మంత్రి అశ్వినీ కుమార్ వ్యాఖ్యానించారు. రాజీనామా తర్వాతా ఆయన ప్రజా జీవితంలోనే ఉంటారని అశాభావం వ్యక్తం చేశారు. ఆయనను రాజ్యసభ మిస్ అవుతుందని వ్యాఖ్యానించారు. ధన్‌ఖడ్ ఎప్పుడూ ఒత్తిళ్లకు తలొగ్గబోరని, ఆరోగ్య సమస్యలే ఆయన నిర్ణయానికి కారణమై ఉంటాయని ఆయన బావమరిది, న్యాయవాది ప్రవీణ్ బల్వాడా వ్యాఖ్యానించారు. గతంలో సభలో ధన్‌ఖడ్ వ్యవహరించిన తీరుతో విసిగిపోయిన ప్రతిపక్ష ఎంపీలు.. చివరకు అవిశ్వాస తీర్మానం పెట్టారు. అది చర్చకే రాలేదు. అలాంటి ఎంపీల్లో కొందరు ఇప్పుడు ఆయనను పొగుడుతున్నారు. రైతు బిడ్డకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తున్నారు. వారిలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, జైరాం రమేశ్ తదితరులున్నారు. రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ అయితే.. ధన్‌ఖడ్‌ను ఏకంగా జాతీయవాది, పోరాటయోధుడు అని పొగిడారు.

# పేదరికం లేని సమాజమే కోసమే పీ4 విధానం... పోస్టర్ విడుదల చేసిన మంత్రి నాదెండ్ల

కలిసి పీ4 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పీ4 కార్యక్రమం వివరాలతో త్వరలో వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.

### ఎన్నారైలు, తెనాలి వాసుల భాగస్వామ్యం

ఈ కార్యక్రమంలో ఎన్నారైలు, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన తెనాలి వాసుల సహకారం తీసుకుంటామని, వారిని భాగస్వాములుగా మార్చే ప్రణాళికను చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. దీని ద్వారా ఎక్కువ మంది మహిళలకు, యువతకు ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు.

### 2047 విజన్... 2029 నాటికి 50 లక్షల కుటుంబాలకు మద్దతు

కూటమి ప్రభుత్వం 2047 విజన్‌లో భాగంగా, 2029 నాటికి 50 లక్షల కుటుంబాలను పేదరికం నుంచి అభివృద్ధి వైపు నడిపించేందుకు ఈ బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించిందని మంత్రి వివరించారు. పేదల సంక్షేమం, సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను గుర్తించి వారికి అవసరమైన మద్దతు కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. నిరుపేద కుటుంబాలను "బంగారు కుటుంబాలుగా" మార్చడమే పీ4 ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

### తెనాలి నియోజకవర్గంలో పీ4 అమలు

తెనాలి నియోజకవర్గంలో సుమారు 14,280 బంగారు కుటుంబాలను ఇప్పటికే గుర్తించామని, వారికి అండగా నిలిచేందుకు 376 మంది వ్యక్తులు ముందుకు వచ్చారని మంత్రి నాదెండ్ల తెలిపారు. వీరు దాదాపు 3,289 మందిని దత్తత తీసుకున్నారని చెప్పారు. డేటా వెరిఫికేషన్ అనంతరం, వీరి సహాయంతో ఆ కుటుంబాలకు ఉపాధి, విద్యకు తోడ్పాటు, వ్యవసాయ సాగు మార్కెటింగ్, బ్యాంకు రుణాలు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి వైద్య సహాయం వంటి అంశాల్లో సహాయం అందించడం జరుగుతుందన్నారు.

త్వరలో తెనాలిలో మార్గదర్శకులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఈ యాక్షన్ ప్లాన్ తెనాలి నియోజకవర్గానికి ఒక రోడ్ మ్యాప్‌గా మారుతుందని మంత్రి నాదెండ్ల ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, తెనాలి ఎమ్మార్వో గోపాలకృష్ణ, కొల్లిపర ఎమ్మార్వో జి. సిద్ధార్థ, తెనాలి ఎంపీడీవో దీప్తి, కొల్లిపర ఎంపీడీవో విజయలక్ష్మి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# అసలు ఆ దేశమే లేదు.. భారత్‌లో మాత్రం ఎంబసీ..

దస్త్రాలు, 34 దేశాల స్టాంపులు, రూ.44 లక్షల నగదు, దౌత్య నంబర్‌ప్లేట్లు, ఖరీదైన కార్లను స్వాధీనం చేసుకున్నారు.

### వెస్ట్‌ఆర్కిటికా..అసలు ఉందా?

2001లో యూఎస్ అధికారి ట్రావిస్ మెక్‌హెన్రీ దీన్ని ప్రకటించాడు. తనను తాను గ్రాండ్ డ్యూక్‌గా ప్రకటించుకున్నారు. అంటార్కిటాలో 6,20,000 చదరపుమైళ్ల మేర తనదే అని చెప్పుకున్నాడు. ఆ దేశానికి 2,536 మంది పౌరులు ఉన్నారని చెప్తున్నా.. అక్కడ ఎవరూ నివసించడం లేదు. అంటార్కిటిక్ ఒప్పందంలోని లొసుగులను ఉపయోగించుకొని దానికి తనను తాను పాలకుడిగా ప్రకటించుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం.. శాంతియుత ప్రయోజనాలు, శాస్త్రీయ పరిశోధనలకు మాత్రమే అంటార్కిటికాను ఉపయోగించుకోవాలి. మిలిటరీ, అణ్వస్త్ర కార్యక్రమాలు, వ్యర్థాలను పడేయడానికి ఏ దేశమూ దానిని వినియోగించుకోకూడదు. ఇవే నిబంధనలు ప్రైవేటు వ్యక్తుల విషయంలో లేదు. ఆ లొసుగునే ట్రావిస్ వాడుకున్నారు. ఈ వెస్ట్‌ఆర్కిటికా ఎంబసీ పేరిట ఏర్పాటు చేసిన ఇన్‌స్టాగ్రాంలో జైన్ తనను తాను ఆ దేశానికి చెందిన సంపన్నుడిగా పేర్కొన్నాడు. 2017 నుంచి దౌత్యకార్యాలయం కార్యకలాపాలు నడుస్తున్నట్లు వెల్లడించాడు. అయితే ఆర్కిటిక్ ఉత్తర ధ్రువంలో ఉండగా అంటార్కిటికాలో ఎలా వచ్చిందన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న.

# భారత్ కీలక నిర్ణయం... చైనా పౌరులకు మళ్లీ పర్యాటక వీసాలు జారీ

ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో, కీలక పరిణామం చోటుచేసుకుంది. చైనా పర్యాటకులకు తిరిగి వీసాలు మంజూరు చేయాలని భారత్ నిర్ణయించింది. ఈ నిర్ణయం జూలై 24 నుంచి అమలులోకి వస్తుందని చైనాలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. సరిహద్దు వివాదాలు, వాణిజ్య ఉద్రిక్తతల కారణంగా దెబ్బతిన్న సంబంధాలను మెరుగుపరచడం దీని లక్ష్యం.గాల్వాన్ ఘర్షణల తర్వాత భారత్ చైనా పెట్టుబడులు, యాప్‌లపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఏర్పడిన దౌత్యపరమైన స్తంభన తర్వాత ఈ నిర్ణయం వెలువడింది. 2022లో భారతీయ విద్యార్థులకు, వ్యాపార యాత్రికులకు చైనా వీసాలను తిరిగి ప్రారంభించినప్పటికీ, భారత్ మాత్రం చైనా పౌరులకు పర్యాటక వీసాల జారీని ఇప్పటివరకు నిలిపి ఉంచింది.తాజాగా, భారత్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని చైనా స్వాగతించింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మాట్లాడుతూ, నిరంతర చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య జరిగిన ఉన్నత స్థాయి సమావేశాలతో దౌత్యపరమైన వాతావరణం మెరుగుపడుతున్న సంకేతాలు ఉన్నప్పటికీ... 3,800 కిలోమీటర్ల వివాదాస్పద సరిహద్దు సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. ఇరుదేశాల సంబంధాలు పూర్తిస్థాయిలో సాధారణ స్థితికి రావాలంటే.... సైనిక ప్రతిష్టంభనను పరిష్కరించడం, వాణిజ్య ఆంక్షలను ఎత్తివేయడం అవసరమని భారత విదేశాంగ మంత్రి నొక్కి చెప్పారు.

# జెలెన్‌స్కీకి వ్యతిరేకంగా భారీ ఆందోళనలు.. ఎందుకంటే..?

మా నాన్న దీనికోసం ప్రాణత్యాగం చేయలేదు" అని పేర్కొన్నారు. దాదాపు పదేళ్లుగా చేపడుతూ వస్తున్న ప్రజాస్వామ్యం, అవినీతి వ్యతిరేక చర్యలకు ఈ బిల్లు గండి కొట్టిందన్న విమర్శలున్నాయి. వాస్తవానికి ఉక్రెయిన్‌లోని బలమైన అవినీతి వ్యతిరేక వ్యవస్థ కారణంగానే పశ్చిమదేశాలతో సంబంధాలు మెరుగుపడటంతోపాటు.. నిధులు వస్తున్నాయి. ఈక్రమంలో ఐరోపా కమిషన్ ప్రతినిధి గిల్లామ్ మెర్సియర్ స్పందిస్తూ.. ఆ దేశంలోని పరిణామాలు ఆందోళనకరమన్నారు.

ప్రస్తుతం ఉక్రెయిన్ చీఫ్ ప్రాసిక్యూటర్‌గా అధ్యక్షుడు జెలెన్‌స్కీకి నమ్మిన బంటుగా పేరున్న రుస్లాన్ క్రావ్చెంకో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్త బిల్లు ప్రకారం నాబులో ఉన్న రష్యా గూఢచారుల కోసం ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీసు, ప్రాసిక్యూటర్ జనరల్ ఆఫీసు తనిఖీలు చేపట్టి అరెస్టు చేస్తుందన్నారు. అయితే ఇది దుర్వినియోగం అవుతుందని ఇప్పటికే పశ్చిమ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 23)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్లో ఉన్న భవిత సెంటర్లో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, అందులకు పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎంత లోటు బడ్జెట్ లో ఉన్న సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తున్నామని కానీ వైసీపీ నాయకులు తమపై బురద జల్లే కార్యక్రమం చేపట్టారని 6 సూపర్ సిక్స్ హామీలలో ఇప్పటికే నాలుగు హామీలను అమలు చేశామని త్వరలోనే మిగతావి పూర్తి చేస్తామని అన్నారు. ఇప్పటికైనా ప్రజలు పనిచేసే తెలుగుదేశం ప్రభుత్వంను ఆదరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకట్రెడ్డి, ఎంఈఓ నాయక్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక
ప్రకాశం

# పేదరికం లేని సమాజ ఆవిష్కరణ కోసం పి 4

**జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**

పేదరికం లేని సమాజ ఆవిష్కరణ కోసం పీ - 4 పథకంలో మార్గదర్శకులుగా నిలిచి మీ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, పరిశ్రమలు, గ్రానైట్ సంఘాల ప్రతినిధులు, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, ఎరువులు, రసాయనాలు, డైరీ ఫారాల యజమానులతో బుధవారం ప్రకాశం భవనంలో వేరువేరుగా ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పీ 4 పథకం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ ప్రతినిధులకు జడ్పీ సీఈవో చిరంజీవి ఈ సందర్భంగా వివరించారు. అనంతరం సమాజంలో అభివృద్ధిపరంగా పై స్థాయిలో ఉన్న 10 శాతం ప్రజలు, కింది స్థాయిలో పేదరికంతో బాధపడుతున్న 20% కుటుంబాలకు పలు రకాలుగా చేయూతనిచ్చి పేదరికాన్ని ఆయా కుటుంబాలు అధిగమించేలా చూడడమే ఈ పథకం ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. ఈ దిశగా చేయూత అవసరమైన కుటుంబాలు మన జిల్లాలో 74 వేలకు పైగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిని 'బంగారు కుటుంబాలు' గా పేర్కొంటున్నట్లు చెప్పారు. ఆయా కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలిచే వారిని ' మార్గదర్శకులు ' అని పేర్కొంటున్నట్లు తెలిపారు. మార్గదర్శకులు ఆర్థిక సహాయమే చేయాలన్నది ఈ పథకం ఉద్దేశం కాదని, బంగారు కుటుంబాలు పేదరికాన్ని అధిగమించేలా వివిధ రకాలుగా 'మార్గదర్శకం' చేయాల్సి ఉంటుందన్నారు. ఆయా అవసరాలను, కుటుంబాలను సచివాలయ సిబ్బంది ద్వారా ఇప్పటికే గుర్తించామన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన వెబ్ సైట్ లో ఈ వివరాలను పొందుపరిచినట్లు చెప్పారు.

ఈ జాబితాను అందజేస్తామని, పరిశీలించి అవసరమైన, చేయగల సహాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ జాబితాలో లేని కుటుంబాలకు కూడా సహాయం అవసరం అని గుర్తించి తమకు తెలియజేస్తే వాటిని కూడా ఇందులో చేర్చుతామని తెలిపారు. ప్రభుత్వము అందిస్తున్న సంక్షేమ పథకాలకు అదనంగా ఇతర సహాయం ఏమైనా బంగారు కుటుంబాలకు అవసరమని గుర్తిస్తే, ఆ దిశగా సహాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. స్వచ్ఛందంగా మార్గదర్శకులుగా ముందుకు రావాలని, శక్తి మేరకు ఎన్ని కుటుంబాలనైనా దత్తత తీసుకునే వెసులుబాటు ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 'బంగారు బాల్యం' కార్యక్రమంలో భాగంగా వల్నరబుల్ (ఆర్ఫన్, సెమీ ఆర్ఫన్) చిన్నారులను గుర్తించేందుకు సర్వే చేశామని ఆమె చెప్పారు. మీ ప్రాంతంలోని ఈ చిన్నారుల చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా చూసేందుకు కూడా పాఠశాలల యాజమాన్యాలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. మీ ప్రాంతంలోని పేదలను, మీ వద్ద పనిచేస్తున్న పేద కార్మిక కుటుంబాలను కూడా ఆదుకునేందుకు సేవా దృక్పథంతో స్వచ్ఛందంగా బాధ్యత తీసుకోవాలని పరిశ్రమల యజమానులకు సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన వైద్య సహాయం చేసేందుకు కూడా ప్రైవేట్ ఆసుపత్రులు ముందుకు రావచ్చు అని చెప్పారు. బంగారు కుటుంబాల్లో అర్హులకు ఆసుపత్రిలో ఉద్యోగ అవకాశాలలో ప్రాధాన్యం కల్పించాలని పిలుపునిచ్చారు.

స్వర్ణాంధ్ర - 2047 కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విజన్ యాక్షన్ ప్లానులో పది సూత్రాలను రూపొందించారని కలెక్టర్ తెలిపారు. పేదరిక నిర్మూలన ఇందులో ఒకటి అని చెప్పారు. పీ - 4 కార్యక్రమం ద్వారా పేదరికం లేని సమాజాన్ని రూపొందించాలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆలోచనలు, ఆశయ సాధనకు అనుగుణంగా సహాయం చేసే శక్తి ఉన్న వారందరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశాలలో జడ్పీ సీఈవో చిరంజీవి, డీఈవో కిరణ్ కుమార్, సీపీవో స్వరూప రాణి, గనుల శాఖ డీ.డీ రాజశేఖర్, (తరువాయి 4లో...)

# పియం సూర్య ఘర్ పథకం పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**

పియం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశమై జిల్లాలో పీ.ఎం. సూర్య ఘర్ పథకం అమలు పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పియం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇప్పటివరకు 83,013 దరఖాస్తులు రాగా, అందులో 1890 దరఖాస్తులు గ్రౌండింగ్ చేయగా, 1754 సోలార్ ఇన్సులేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. రోజువారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని జిల్లాలో పీఎం సూర్య ఘర్ అమలును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్, విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. నియోజక వర్గానికి 10 వేల లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందని, అందుకనుగుణంగా మండలాల వారీగా, గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాలికలు (తరువాయి 4లో...)

# మాజీ మంత్రి బాలినేనితో కలిసి ప్రీమియర్ షో తిలకించిన షణ్ముఖ వెలుగు దినపత్రిక



**ఎడిటర్ రాధాకృష్ణ, మాజీ డిఆర్‌యుసిసి మెంబర్ ఎం ఎన్ రెడ్డి**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**

మాజీ మంత్రి, జనసేన రాష్ట్ర నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి, నెల్లూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు చిట్టమూరు ప్రవీణ్ కుమార్‌రెడ్డితో కలిసి బుధవారం రాత్రి స్థానిక కృష్ణ థియేటర్ నందు ప్రీమియర్ షోను షణ్ముఖ వెలుగు దినపత్రికి ఎడిటర్ రాధాకృష్ణ, మాజీ డిఆర్‌యుసిసి మెంబర్ ఎం ఎన్ రెడ్డి తిలకించారు. ఈ సందర్భంగా ఎం ఎన్ రెడ్డి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రజల ముందుకొచ్చిన పవన్ కళ్యాణ్ తొలి చిత్రం విజయవంతంగా నడుస్తుందని ఆకాంక్షించారు.



# సైబర్ నేరగాళ్ళు అరెస్టు

**బ్యాంకు పాస్ పుస్తకాలు, ఏటిఎం కార్డులు స్వాధీనం**

**కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ ఏ ఆర్ దామోదర్**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**

తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్లు నిర్వహిస్తున్న ఆరుగురు ముఠా సభ్యులు పోలీసులు అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. ముద్దాయిలు షేక్ నాయబ్ రసూల్, అరుసుమళ్ళ ప్రణీత్ కుమార్, సయ్యద్ షహిజాద్, సింగన బోయిన చైతన్య, షేక్ ఖాదరున్నిసా, షేక్ అయేషాలను సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట గ్రామం వద్ద అరెస్టు చేశారన్నారు. వారి వద్ద నుండి పలు ఏటీఎం కార్డులు, బ్యాంకు పాసు బుక్క లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఉదయగిరికి చెందిన షేక్ యాసిన్ విదేశాల్లో ఉంటూ ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ నిర్వహిస్తున్నటువంటి వైట్, జిమ్మీ, మౌనిక కలసి ముద్దాయిలు మరి కొంతమందితో టెలిగ్రామ్ ద్వారా పరిచయాలు ఏర్పడ్డాయి. ఇండియాలో కూడా ఈ ఆన్లైన్ బెట్టింగ్ యాప్‌లో ఎక్కువ మంది గేమ్స్ ఆడుతున్నారు. దీనికి సంబంధించి మనీ ట్రాన్స్ఫర్ గురించి అనేక బ్యాంకు ఖాతాలు అవసరం కావడంతో షేక్ యాసిన్, జిమ్మీ, వైట్, మౌనిక, కొంత మందితో టెలిగ్రామ్ యాప్ ద్వారా నెల్లూరుకు చెందినటువంటి శ్యామ్ హైదరాబాదులో ఉన్నటువంటి ప్రణీత్ మరి కొంతమందిని ఆ టెలిగ్రామ్ యాప్లో యాడ్ చేసుకొని, ఎవరైనా సేవింగ్ అకౌంట్ తమకు ఇస్తే ఒక్కో సేవింగ్ అకౌంట్‌కు రూ. 25వేలు, కరెంట్ అకౌంట్ కనుక ఓపెన్ చేసి వాటి తాలూకా సిమ్ కార్డ్, డెబిట్ కార్డు, బ్యాంకు బుక్కు వాళ్లకు ఇస్తే రూ. 45 వేలు ఇస్తామని చెప్పారన్నారు. దీంతో ఆ నగదుకు ఆకర్షితులైన ప్రణీత్ తన స్నేహితుడు అయిన ఒంగోలుకు చెందిన నాయబ్ రసూల్‌తో ఈ విషయాన్ని చెప్పారన్నారు. నాయబ్ రసూల్ తన తల్లి మస్తానమ్మ, వీరమన్యంలో ఆయాగా పనిచేస్తున్న ఆయేషాతో పీర్లమాన్యంలోని కొంత మందితో కర్ణాటక బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్ సేవింగ్, కరెంట్ అకౌంట్లు ఓపెన్ చేయించి ఒక్కొక్క సేవింగ్ అకౌంటుకు రూ. 6,000, (తరువాయి 4లో...)

# హరిహర వీరమల్లు చిత్రం అఖండ విజయం సాధించాలి

**మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి**

**కుటుంబ సమేతంగా కృష్ణ థియేటర్‌లో వీక్షించిన బాలినేని**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**

జనసేన పార్టీ అధినేత,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం అఖండ విజయం సాధించాలని మాజీ మంత్రి, జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. హరిహర వీరమల్లు సినిమా విడుదల సందర్భంగా ఆయన అభిమానులతో (తరువాయి 4లో...)



# బాపట్ల జిల్లాలో బ్లాక్ బర్లీ పొగాకు సాగు నిషేధం

**ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి**

**రైతులు సహకరించాలి**

**కలెక్టర్ జె వెంకట మురళి**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 23)**

జిల్లాలో బ్లాక్ బర్లీ పొగాకు సాగుపై జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది బ్లాక్ బర్లీ పంట సాగును పూర్తిగా నిషేధించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించే రైతులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం బాపట్ల కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మురళి అధ్యక్షతన మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రైవేట్ బయ్యర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది కంపెనీల హామీలతో రైతులు అధికంగా బ్లాక్ బర్లీ సాగు చేశారని తెలిపారు. అయితే కొనుగోలు సమయంలో కొన్ని కంపెనీలు వెనకడుగు వేసిన నేపథ్యంలో, రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. గతంలో డిమాండ్‌కు మించి సాగు జరగడం వల్ల మార్కెట్‌లో ధరలు గణనీయంగా పడిపోయాయని, ఇది రైతుల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపిందని ఆయన వివరించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో బ్లాక్ బర్లీ పంట సాగు చేయకూడదని, ఇది పూర్తిగా నిషేధితమని పునరుద్ఘాటించారు. నర్సరీలలోనూ బ్లాక్ బర్లీ నారు సాగు చేయటం నిషేధమని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘించి ఎవరు సాగు చేస్తే, వ్యవసాయ శాఖ అధికారులు పంటను ధ్వంసం చేయడంతో (తరువాయి 4లో...)

## బీఆర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 23)

కందుకూరు పట్టణంలోని స్థానిక పామూరు రోడ్డులోని ఉన్న బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ ఒలంపియాడ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో బుధవారం బాలికలకు అవగాహన కల్పించుటకు "గుడ్ టచ్,బ్యాడ్ టచ్" మధ్య తారతమ్యములను తెలియజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కందుకూరు టౌన్ ఎస్.ఐ శివ నాగరాజు మాట్లాడుతూ.. నైతిక విలువలు దిగజారిన ప్రస్తుత రోజుల్లో మైనర్ బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ల మీద అవగాహన కలిగి ఉంటే వేదింపులకు గురి కాకుండా జాగ్రత్త వహించవచ్చని బాలికలకు తెలియజేశారు.అలాగే బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ.. బాలికలకు అసౌకర్యంగా ఏం జరిగినా వెంటనే తల్లిదండ్రులకు, మేనేజ్మెంట్ వారికి తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో.. ఏఎస్సై వెంకటేశ్వర్లు ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ డి.శశికళ జ్యోతి,బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి.బాల భాస్కరరావు, బి. నరేంద్రబాబు, పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్, తదితర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జన విజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కేటిసి పాపారాయుడు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 23)

ఒంగోలు లోని విజయ పిజి కాన్ఫరెన్స్ హాల్లో ప్రకాశం జిల్లా నూతన కమిటీ సమావేశం డాక్టర్ వెన్నపూస బ్రహ్మా రెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్ కొల్లా నాగేశ్వర రావు అధ్యక్షతన జరిగింది. జన విజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా అధ్యక్షులుగా చిగురుపాటి చిన్నాజీ, ప్రధాన కార్యదర్శిగా డా!! కె టి సి పాపారాయుడు, ట్రెజరర్ గా యం.వి.జి సంజీవ రావు ను ఎన్నుకున్నట్లు డా!! నాగేశ్వర రావు అన్నారు. డా!! నాగేశ్వర రావు మాట్లాడుతూ నూతన కమిటీ శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో పెంపొందించడంలో , అజ్ఞానం ,మూఢ నమ్మకాలపై పోరాటం చేయడంలో మరింత చురుకుగా పనిచేస్తుందన్న నమ్మకం ఉందని తెలియజేశారు. అదే విధంగా నూతనంగా ఎన్నికైన కమిటీ రెండు సంవత్సరాల పాటు ప్రకాశం జిల్లాలో అన్ని నియోజక వర్గాల్లో, మండలాల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని చూచించారు. ప్రతి నెలా మొదటి ఆదివారం కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. మూడు నెలలకు ఒకసారి జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. గ్రామ గ్రామాన తిరిగి మూఢ నమ్మకాలపై అవగాహన కల్పిస్తూ సభ్యుల సంఖ్య పెంచి ప్రతి ఒక్కరినీ సభ్యులుగా చేర్చాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కమిటీ ఉపాధ్యక్షులు షేక్ గయాజ్ భాష గారు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లా మధు గారు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్లు గారు, రాష్ట్ర సమత నాయకులు కొమ్మిరెడ్డి కొండమ్మ గారు, రాష్ట్ర సమాచార కార్యదర్శి మీన ధనుంజయ్ గారు మరియు వివిధ డివిజన్ ల నుంచి విచ్చేసిన జన విజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు.





## హరిహర వీరమల్లు చిత్రం అఖండ విజయం సాధించాలి



కలిసి సినిమాను వీక్షించేందుకు బుధవారం ఒంగోలు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నివాసం జనసైనికులు, కార్పొరేటర్లు, అభిమానులతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి హోదాలో ప్రజల ముందుకు వస్తున్న తొలి చిత్రం హరిహర వీరమల్లు అని అన్నారు. పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రం మంచి సక్సెస్ బాటలో నడవాలని బాలినేని ఆకాంక్షించారు. అనంతరం బుధవారం రాత్రి ప్రీమియర్ షో నిర్వహించిన కృష్ణ థియేటర్ వద్దకు పార్టీ నాయకులు, అభిమానులతో భారీ ర్యాలీగా చేరుకున్నారు. థియేటర్‌లో బాలినేని తన సతీమణి సచీదేవి, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో కలిసి సినిమాను వీక్షించారు.

## బాపట్ల జిల్లాలో బ్లాక్ బర్లీ పొగాకు సాగు నిషేధం



పాటు నేరుగా చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. రైతులు ప్రత్యామ్నాయ, లాభదాయక పంటలపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే పండించిన బ్లాక్ బర్లీ పొగాకును రైతులు ప్రైవేట్ కంపెనీలకు విక్రయించవచ్చని కలెక్టర్ తెలిపారు. అయితే వర్షాల ప్రభావం నుంచి రైతులు పండించిన పొగాకు పంటను రక్షించుకోవాలని, తేమ శాతం 20% మించిన బేళ్లను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావద్దని స్పష్టం చేశారు. రైతులు ఎటువంటి అపోహలకు లోను కాకుండా ప్రభుత్వంపై నమ్మకంతో ఉండాలని, ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ప్రతి రైతు పండించిన చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. పొగాకు రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ తెలిపారు.



## సైబర్ నేరగాళ్ళు అరెస్టు





కరెంట్ అకౌంట్‌కు రూ.10,000 చొప్పున వారికి ఇచ్చి వారి వద్ద ఉన్నటువంటి సేవింగ్ ఖాతా, కరెంటు ఖాతా సిమ్ కార్డ్, ఏటీఎం కార్డ్ బ్యాంకుబుక్‌ను వారు తీసుకున్నారని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో అజయ్, విజయ్, శ్యామ్, రబ్బు, విజయ్, జిమ్మీ, వైట్, మౌనిక, షేక్ యాసిన్లను త్వరలో పట్టుకొంటామన్నారు. కేసును ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేధించిన ఒంగోలు డిఎస్పీ శ్రీనివాసరావు, ఒంగోలు తాలుకా సిఐ విజయ కృష్ణ, సైబర్ క్రైం సిఐ వి సూర్యనారాయణ, దర్యాప్తు అధికారి బి ఫణి భూషణ్, ఐటి కోఆర్ ఆర్ఎస్ఐ భరత్‌లను జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

## పేదరికం లేని సమాజ ఆవిష్కరణ కోసం పి 4



జిల్లా పరిశ్రమల సంస్థ మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవికుమార్, డీ.ఎం.హెచ్.వో. వెంకటేశ్వర్లు, డీ.సీ.హెచ్.ఎస్. శ్రీనివాస నాయక్, ఎన్.టీ.ఆర్. వైద్యసేవ జిల్లా సమన్వయకర్త హేమంత్, ఔషధ నియంత్రణ శాఖ ఏ.డీ. జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, ఏ.పీ.ఎం.ఐ.పీ. పీ.డీ. శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**క్షయ బాధితులకు సహాయం ....** క్షయ బాధితులకు మంచి పోషకాహారం కోసం 12 మంది గ్రానైట్ పరిశ్రమల యజమానులు రూ.2,60,000 లను విరాళంగా ఇచ్చారు. కలెక్టర్ చేతుల మీదగా జిల్లా క్షయ నివారణ అధికారి శ్రీవాణికి అందించారు. విరాళము ఇచ్చిన వారికి ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందించారు.





## పియం సూర్య ఘర్ పథకం పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

రూపొందించాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. జిల్లాలో తూర్పు నాయుడుపాలెం, శంఖవరం, నాగంబొట్లపాలెం, సింగరాయకొండ, బేస్తవారిపేట గ్రామాలను ప్రత్యేక గ్రామాలుగా ఎంపిక చేసి 5 గ్రామాలలో సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు చేపట్టిన చర్యలు, సాధించిన పురోగతిపై ఈ సందర్భంగా కలెక్టర్ సమీక్షించారు. ఎక్కడైనా సబ్సిడీ రిలీజ్ చేయడంలో సమస్యలు ఉంటే వెంటనే ఎల్డిఎం దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్, అధికారులకు సూచించారు. క్షేత్ర స్థాయిలో అన్నీ వర్గాల ప్రజలను, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేసి అన్ని గ్రామాల్లోనూ సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సౌర విద్యుత్ వినియోగం వలన కలిగే ప్రయోజనాలను, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని ప్రజలకు వివరించేలా డివిజన్ ఈ ఈ లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఏపిసిపిడిసిఎల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, ఎల్డిఎం రమేష్, సోలార్ విద్యుత్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గంజాయి రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దాలి

## జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 23)**

బాపట్లను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో మాదకద్రవ్య నివారణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో, కళాశాలలో ఈగల్ టీం లను ఏర్పాటు చేసి మాదక ద్రవ్య వినియోగం వలన కలిగే నష్టాలను గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర గౌడ్ తెలిపారు. జిల్లాలో నిషేధిత మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకాలపై కేసులు నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు వీటిని వినియోగిస్తున్నారని అన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావడం వలన వారు వ్యక్తిగతంగా నష్టపోవడంతో పాటు సమాజంలోనూ తీవ్రమైన దుష్పరిణామాలు, ఇబ్బందులు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రస్థాయిలోను, జిల్లా స్థాయిలోను పోలీసులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నిషేధిత మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్ధాలపై సమస్యాత్మక ప్రాంతాల్లోనూ, విద్యాసంస్థల్లోనూ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లోనూ,కళాశాలలోనూ,ఉన్నత విద్యా సంస్థల్లోనూ విద్యార్థులు ఆకర్షణలకు గురై మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా నిరంతరం అవగాహన, పర్యవేక్షణ కోసం పోలీస్ శాఖ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ఈగల్ క్లబ్ లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లోనూ, పంచాయతీ, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులతోను ఈగల్ క్లబ్ లను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిషాముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్ధాలపై యువతకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించేలా విద్యాసంస్థల్లో ఫ్లాష్ మాబ్లు, ర్యాలీలు వివిధ రకాల పోటీలు నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఇతర ప్రాంతాల్లోనూ మత్తు పదార్థాలు బస్సులలో రవాణా జరగకుండా రవాణా శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాలను విక్రయించే వారిని, వాటిని వినియోగిస్తున్న వారిని గుర్తించి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు విద్యాసంస్థల నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అవసరమైన సహకారాన్ని అందించాలన్నారు. మాదకద్రవ్యాలకు



అలవాటు పడిన వారిని డి ఎడిక్షన్ సెంటర్లో చికిత్సతో పాటు, అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. పాఠశాలల్లో డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి ఏ రూపంలో ఉన్న అది ఎక్కడి నుండి వస్తున్నది, దానిని నిర్మూలించే ఉద్దేశంతో ఈగల్ అనే ఆపరేషన్ సంస్థను రాష్ట్ర పోలీస్ శాఖ ఏర్పాటు చేసిందని క్రైమ్ డి.ఎస్.పి జగదీష్ నాయక్ తెలిపారు. దీనికి అధికారులు అందరూ సహకరించాలని ఆయన కోరారు. అందరి సహకారంతో జిల్లాలో 2022 నుండి 2025 సంవత్సరం వరకు మొత్తం 73 కేసులు నమోదు చేయడమైనదని తెలిపారు. జిల్లాలో 64 మంది గంజాయి సరఫరా చేసేవాళ్లు, 275 మంది గంజాయిని అమ్మే వాళ్ళుగా గుర్తించడమైనదని తెలిపారు. గంజాయి ముఖ్యంగా ఒరిస్సా, అల్లూరి సీతారామరాజు జిల్లా, రామచంద్రాపురం నుండి జిల్లాకు వస్తుందని ఆయన తెలిపారు. బాపట్ల జిల్లాలో గంజాయి సరఫరా, అమ్మే వాళ్ళు స్టువర్ట్ పురం, చీరాల ప్రాంతంలో ఉన్నారని ఆయన తెలిపారు. జిల్లా నుండి జాతీయ రహదారి 16 వెళుతుందని, జాతీయ రహదారిపై మార్టూరు వద్ద ఉన్న టోల్ ప్లాజా దగ్గర నిరంతరం తనిఖీలు చేస్తున్నామని ఆయన తెలిపారు. జిల్లాలో 14 యాంటీ గంజాయి టీంలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గంజాయి రవాణాను పట్టుకోవడం జరుగుతుందని జిల్లాలో ఎన్ డి పి ఎస్ యాక్ట్ కేసుల్లో 38 మందిని పదేపదే నేరం చేసేవారిగా గుర్తించడమైనదని అన్నారు. పాఠశాలలో ఈగల్ ఆపరేషన్ సేవ్ జోన్ క్రింద ఈగల్ క్లబ్ టీంలు ఏర్పాటు చేసి, పాఠశాల సమీపంలో 100 మీటర్ల దూరంలో టీ షాపులు,సిగరెట్ షాపులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టీ షాపుల్లో సిగరెట్ షాపుల్లో, గంజాయి చాక్లెట్ రూపంలో ఉన్నాయా లేదా అని చూడాలన్నారు. ఇప్పటివరకు 451 చలానాలు కట్టించడం జరిగిందన్నారు. మున్సిపాలిటీలలో ఏమైనా ఇండ్లు ఖాళీగా, వదిలివేసి ఉంటే అక్కడ లైట్లు, సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేయాలని, అటువంటి ప్రాంతాలలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ క్రైమ్ తెలిపారు. డ్రగ్స్ హాట్ స్పాట్లను గుర్తించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చే రైళ్లు కూడా తనిఖీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎక్కడైనా గంజాయి అమ్ముతున్న, కొంటున్న సదరు వ్యక్తుల వివరాలను 1972 టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయాలని ఆయన తెలిపారు. అట్లు తెలిపిన వారి సమాచారం గోప్యంగా ఉంచబడుతుందన్నారు. మాదక ద్రవ్య నివారణ కమిటీ సభ్యులు మాదకద్రవ్యాల వినియోగ నివారణ పై వారు చేపట్టిన చర్యలను, అవగాహన కార్యక్రమాలను ఆయన వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడినవారు మెడికల్ షాపులో దొరికే సిట్రజిన్ వంటి మందులను ఎక్కువ మోతాదులో తీసుకుంటున్నారని అధికారులు జిల్లా రెవెన్యూ అధికారి దృష్టికి తీసుకువచ్చారు. ఎక్కువ మోతాదులో మందులను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అధికారికి సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, రవాణా శాఖ అధికారి పరంధామరెడ్డి, పోర్టు అధికారి బివిఎం మూర్తి, ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ అధికారి రాజ్ దేబోరా, వికలాంగుల సంక్షేమ అధికారి సువార్త, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, షాడో స్వచ్ఛంద సంస్థ ఎన్జీవో రాజా సాల్మన్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# విధుల పట్ల మహిళా పోలీసులకు దిశానిర్దేశం





**(షణ్ముఖ వెలుగు, నాగులప్పలపాడు, జులై 23)**

ఒంగోలు రూరల్ సీఐ ఎన్ శ్రీకాంత్ బాబు ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు మండలంలో పనిచేసే మహిళా పోలీసులు (జిఎం ఎస్కె)తో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం నందు మహిళా పోలీసులకు వారి విధుల పట్ల దిశ నిర్దేశం చేశారు. మహిళా పోలీసులు వారి వారి గ్రామాల నందు పాఠశాలలు కళాశాలలకు వెళ్లి గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి పిల్లలకి అవగాహన కల్పించాలని తెలియజేసినారు. అదేవిధంగా గంజాయి వద్దు మా జీవితం మాకు ముద్దు అనే నినాదంతో ప్రతి స్కూల్లో గంజా వ్యతిరేక ఈగల క్లబ్బులు ఏర్పాటు గురించి చర్చించారు. అదేవిధంగా శక్తి వారియర్ గ్రూపుల గురించి వారికి అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామాలలో జరుగుతున్నటువంటి తిరణాలు జాతరల సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం నందు నాగులుప్పలపాడు ఎస్ఐ ప్రజా సుల్తానా, మహిళా పోలీస్ ఇంచార్జ్ పరమేశ్వరి, మండల మహిళా పోలీస్లు పాల్గొన్నారు.

# బండ్లమూడి గ్రామంలో కిషోర్ వికాసం





**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, జులై 23)**

మండలంలోని బండ్లమూడి గ్రామంలో కిషోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా కౌమర దశలో ఉన్న బాల,బాలికలకు జిల్లా పరిషత్ హైస్కూల్లో జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు జిల్లా స్త్రీ ,శిశు సంక్షేమ, సాధికార అధికారిణి సువర్ణ వారి ఆధ్వర్యంలో సిడిపిఓ ఇవాంజీలిన్ అధ్యక్షతన జిల్లా బాలల సంరక్షణ విభాగం ద్వారా కార్యక్రమం చేయడం జరిగింది. జిల్లా బాలల సంరక్షణ విభాగం, న్యాయ, పరివీక్షణ అధికారి బి రత్నప్రసాద్ కార్యక్రమంలో పాల్గొని 11 నుంచి 14 సంవత్సరాలు మరియు 15 నుంచి 18 సంవత్సరాలు లోపు బాల బాలికలకు లింగ వివక్షత, సంపూర్ణ ఆహారం ఆరోగ్యం, బాల్యవివాహాలు అరికట్టడం, మానవ అక్రమ రవాణా, బాలల చట్టాలు, బాలల హెల్ప్ లైన్ నెంబర్ 1098 ద్వారా కలిగే ఉపయోగాలు, గురువుల యొక్క విశిష్టత పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం జిల్లాలోని ప్రతి హై స్కూల్ మరియు జూనియర్ కాలేజ్ ఐటిఐ, పాలిటెక్నిక్ కాలేజీలలో జరుగుతుందని తెలిపారు. ఎస్ఐ ఆర్ కృష్ణయ్య మానవ అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించారు. బాలల సంరక్షణ అధికారి శ్రీలక్ష్మి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై బాలలు తీసుకోవలసిన జాగ్రత్తలకు సంబంధించిన అంశాల పై అవగాహన కల్పించారు. హై స్కూల్ హెడ్మాస్టర్ భాస్కర్ శాస్త్రి, నోడల్ టీచర్ విశ్వభారతి, శామ్యూల్ రాజ్ డిసిపియు, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ పి నాగలక్ష్మి, సిహెచ్ శైలజ, స్కూల్స్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా గ్రంధాలయ సంస్థలో రూ.73 లక్షలతో ఆధునీకరణ పనులు

## జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల కృష్ణ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**



ఒంగోలు నగరంలోని జిల్లా గ్రంధాలయ సంస్థలో రూ.73 లక్షలతో ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు జాయింట్ కలెక్టర్, జిల్లా గ్రంధాలయ సంస్థ పర్సన్ ఇంచార్జి ఆర్ గోపాల క్రిష్ణ తెలిపారు. బుధవారం ఉదయం ఒంగోలు కలెక్టరేట్లోని జాయింట్ కలెక్టర్ చాంబర్లో జాయింట్ కలెక్టర్, జిల్లా గ్రంధాలయ సంస్థ పర్సన్ ఇంచార్జి ఆర్ గోపాలక్రిష్ణ అధ్యక్షతన జిల్లా గ్రంధాలయ సంస్థ సర్వసభ్య సమావేశం, జిల్లా గ్రంధాలయ సంస్థ సెస్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గ్రంధాలయాల అభివృద్ధి కి చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. అందులో భాగంగా జిల్లా గ్రంధాలయ సంస్థలో రూ.73 లక్షలతో ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ ఆధునీకరణ పనులకు గాను తొలి విడతగా రూ.23 లక్షల రూపాయల నిధులను కూడా మంజురు చేసినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రాపర్టీ టాక్స్ రూపంలో కలెక్ట్ చేసే లైబ్రరీ సెస్ మొత్తాలను సంబంధత నగర పాలక సంస్థలు, గ్రామ పంచాయతీలు వెంటనే జిల్లా గ్రంధాలయ సంస్థకు బకాయలు లేకుండా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, మునిసిపల్ కమీషనర్ల ను, జిల్లా పంచాయాతీ అధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ వారీగా పెండింగ్లో వున్న లైబ్రరీ సెస్ బకాయలపై జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. దిన, వార పక్ష, మాస పత్రికల వివరాలు, వివిధ పోటీ పరీక్షలు సంబంధించిన పుస్తకాల వివరాలను ఆరా తీశారు. గ్రంథాలయాల అభివృద్ధికి సంబంధించి 2025-26 బడ్జెట్ ను మరియు కందుకూరు, వలేటివారిపాలెం, ముండ్లమూరు, కొమరోలు శాఖా గ్రంధాలయాల భవనాలకు 5 శాతం అద్దె పెంపు వంటి అంశాలను జిల్లా గ్రంధాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో కమిటీ ఆమోదించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి శివారెడ్డి, ఒంగోలు మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకట నాయుడు, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస సంజయ్, ఆడిట్ అధికారి రమేష్, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని మున్సిపాల్టీల కమీషనర్లు, తదితరులు పాల్గొన్నారు.



# నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయాలి

**(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 23)**



జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులందరితో దరఖాస్తు చేయించాలని ఎంఈవో-2 శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక అర్బన్ కాలనీ ఉర్దూ పాఠశాలలో నవోదయ దరఖాస్తు ఆన్లైన్ ప్రక్రియపై ఉపాధ్యాయులకు అవగాహన కలిగించారు.ఈ సందర్భంగా ప్రచార గోడ పత్రాన్ని అతికిస్తూ,ఈ విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులతో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశానికై ఎంట్రెన్స్ టెస్ట్ వ్రాయించేలా అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో సిఆర్పి. మురళి, హెచ్ఎం. నిర్మల కుమారి, అకౌంటెంట్ రామచంద్రుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు రాజాకృష్ణ, అమీనాభి తదితరులు పాల్గొన్నారు.

# జాబ్‌మేళ గోడపత్రికను విడుదల చేసిన ఎమ్మెల్యే బీఎన్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ , జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో గవర్నమెంట్ జూనియర్ కళాశాల, మద్దిపాడులో 10కు పైగా బహుళ జాతీయ కంపెనీలతో 27-07-2025వ తేదీన జరగబోవు జాబ్ మేళా గోడ పత్రికలను ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27వ తారీకు (ఆదివారం) గవర్నమెంట్ జూనియర్ కళాశాల, మద్దిపాడు యందు 10కు పైగా బహుళ జాతీయ కంపెనీలతో జరగబోవుజాబ్ మేళ గోడ పత్రికలను సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి.ఎన్ విజయ్ కుమార్ ,తన పార్టీ కార్యాలయంలో ఈరోజు విడుదల చేసినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జే రవితేజ యాదవ్ తెలియజేశారు. కావున సంతనూతలపాడు నియోజకవర్గం, ప్రకాశం జిల్లాలో 18 సంవత్సరముల నుంచి 30 సంవత్సరముల మధ్య గల పదవ తరగతి నుంచి పీ.జీ వరకు చదువుకొని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. ఇంటర్వ్యూలలో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు నెలకు జీతం 10,000 రూపాయల నుండి 25,000 వరకు ఇవ్వబడుతుందన్నారు.

# 13 మంది మలినేని సుశీలమ్మ కళాశాల విద్యార్థినులకు ప్రాంగణ ఎంపికల్లో సావంటిస్ కంపెనీలో ఉద్యోగాలు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 23)

స్థానిక కనుమళ్ల గ్రామంలోని మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలోని నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులలో 72 మందికి గాను 13 మందికి ప్రముఖ బహుళ జాతి సంస్థ సావంటిస్‌లో (సంవత్సరానికి2.5 నుండి 3.5 లక్షలు) ఉద్యోగ అవకాశాలు సాధించారు. ఈ సంధర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులను కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు అభినందిస్తూ, ఉద్యోగాలు సాధించిన వెంటనే అలసత్వం రానివ్వకుండా ఇంకా పట్టుదలతో ముందుకు వెళ్లాలని తెలియజేసారు.ఈ ప్రాంగణ ఎంపికల ప్రక్రియ 19 జులై న మొదలై, 4 దశలలో జరిగిన వివిధ పోటీ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థినులకు ఈ అవకాశం లభించిందని మరియు ప్రస్తుతం ఉన్న ఆర్థిక మాంధ్యం పరిస్థితుల్లో కూడా ప్రకాశం జిల్లాల్లో ఈ కంపెనీ తరుపున అవకాశం కలిగిన కళాశాలల్లో మలినేని సుశీలమ్మ కళాశాల కుడా ఉండటం చాలా ఆనందించతగ్గ విషయం అని ఈ కళాశాల ఉపాధి కల్పనా అధికారిణి ఆర్. శ్రవంతి తెలియజేసారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ అన్నమనేని గోపాల కృష్ణ మూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

# ఖరీఫ్ సీజన్లో వేసిన ప్రతి పంటకు భీమ నమోదు చేసుకోవాలి





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 23)

మండలంలోని రావులకొల్లు, ఉప్పలదిన్నె గ్రామాలలో మండల వ్యవసాయాధికారి వి.రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రాము మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వేసిన ప్రతి పంటకూ పంట నమోదు కార్యక్రమం సంబంధిత వ్యవసాయ సహాయకులు ద్వారా చేసుకోవాలని సూచించారు . ఖరీఫ్ రబీ సీజన్లో వేసే ప్రతి కౌలు రైతు మీ సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులకు మీరు వేసే పంటను తెలియజేసి గ్రామ రెవెన్యూ అధికారులు ద్వారా కౌలు ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చునని, తద్వారా రాబోయే రోజుల్లో వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు విత్తనాలు,ఎరువులు, ధాన్యం అమ్ముకోవడానికి, ప్రకృతి వ్యాపారిత్యాల వల్ల వచ్చే పంట నష్టం లేదా పంట పండకపోతే ఇన్సూరెన్స్, బ్యాంకు నుండి పంట రుణాలు, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను పొందవచ్చునని తెలియజేసారు. పొన్నలూరు పశు వైద్యాధికారి డాక్టర్ పి.శివరామ క్రిష్ణ మాట్లాడుతూ పశు పోషకులకు పశువులలో వచ్చు వ్యాధులు గురించి మరియు వివిధ పథకాలు గురించి వివరించారు. ఉద్యానవన శాఖ అధికారిని పి విష్ణుప్రియ మాట్లాడుతూ ఉద్యానవన శాఖ నుండి కూరగాయలు, పండ్లు మరియు పూల తోటల పెంపకానికి 40శాతం రాయితీ వస్తుందని, అలాగే పండ్ల తోటలు గల రైతులకు సేద్యపు కుంటలు మరియు మల్చింగ్ రాయితీ తో అందుబాటులో ఉన్నాయని తెలిపారు కార్యక్రమంలో రావులకొల్లు గ్రామ వ్యవసాయ సహాయకులు ఎ నాగమల్లేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, గ్రామ పశు వైద్య సహాయకులు నవనీత ఉప్పలదిన్ని గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ ఇమ్రాన్ నజీర్, గ్రామ పశు వైద్య సహాయకులు షేక్ మోబిన, రెండు గ్రామాల పెద్దలు, రైతులు పాల్గొన్నారు. రావులకొల్లు, ఉప్పలదిన్నె గ్రామాలలో మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

# డోర్ టు డోర్ చెత్త సేకరణ, డ్రైనేజీ క్లీనింగ్ పటిష్టంగా నిర్వహించాలి











(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)

ఒంగోలు నగరంలో డోర్ టు డోర్ చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించడంతో పాటు డ్రైనేజ్ క్లీనింగ్ ప్రక్రియ పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా, ఒంగోలు నగరంలో కోట వీధి, బలరాం కాలనీ, మిలటరీ కాలనీ, దిబ్బల రోడ్డు తదితర ప్రాంతాలను ఆకస్మికంగా సందర్శించి, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. తొలుత జిల్లా కలెక్టర్ బాపూజీ కాంప్లెక్స్ ఎదురగా వున్న కోట వీధిని సందర్శించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆ ప్రాంత ప్రజలతో మాట్లాడుతూ వారానికి ఎన్ని రోజులు ఇంటింటి చెత్త సేకరణ జరుగుచున్నది, చెత్త సేకరణకు శానిటేషన్ సిబ్బంది వస్తున్నారా లేదా, తడి చెత్త, పొడి చెత్త వేరు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాత మార్కెట్ సెంటర్‌లో పారిశుధ్య నిర్వహణపై జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఒంగోలు నగరంలో పారిశుధ్య నిర్వహణ కచ్చితంగా జరగాలని, నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన శానిటేషన్ సిబ్బంది పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేసారు. రహదారుల్లో మురుగునీరు నిల్వ కుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ బలరాం కాలనీ, మిలటరీ కాలనీని సందర్శించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. చెత్త సేకరణ జరుగుచున్నది కాని, మురుగు కాలువల క్లీనింగ్ జరగడం లేదని ఆ ప్రాంత ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. డోర్ టు డోర్ చెత్త సేకరణ సక్రంగా నిర్వహించడంతో పాటు డ్రైనేజ్ క్లీనింగ్ ప్రక్రియ పటిష్టంగా నిర్వహించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దోమల నివారణ చర్యలు కచ్చితంగా జరగాలన్నారు. అందుకనుగుణంగా డివిజన్స్ వారీగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అలాగే వర్షా కాలం సీజన్ ప్రారంభమైనందున పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు డెంగు, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు ప్రజలు గురికాకుండా ముందుగా ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చేపట్టిన దోమల నివారణ చర్యలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో పర్యటించి పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్, శానిటేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ దిబ్బల రోడ్డు ప్రాంతాన్ని సందర్శించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట ఒంగోలు మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వేములపాడుకు రెగ్యులర్ గా బస్ నడపాలి

## వ్యవసాయ కార్మిక సంఘం విజ్ఞప్తి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)

సంతనూతలపాడు మండలం వేములపాడు గ్రామానికి ఆర్టీసీ బస్సును రెగ్యులర్ గా నడపాలని బుధవారం ఒంగోలు లోని డిపో మేనేజర్ ఘట్టమనేని శ్రీనివాసరావు కు వ్యవసాయ కార్మిక సంఘం అర్జీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన బోయళ్ల వెంగళరావు, అనమలకుర్తి వెంకటరత్నం, ఎల్. నాగేశ్వర రావు, ఎ. నరసయ్యలు మాట్లాడుతూ ప్రస్తుతం బస్సు తిరుగుతున్నా ఏరోజు వస్తుందో, ఏరోజు రాదో తెలియటం లేదని అన్నారు. శివారు గ్రామం అయినందున ఆటోలు కూడా రావడం లేదని అన్నారు. టివీలర్ వాహనాలు లేనివారు 4 కిలో మీటర్లు నడిచి చిలకపాడు వచ్చి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తమ గ్రామంలో ప్రాథమిక వైద్యశాల ఉందని నాలుగైదు గ్రామాల నుండి వైద్యం కోసం ప్రజలు వస్తారని, 25 మంది అందులో వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. గ్రామం నుండి హైస్కూల్ కు విద్యార్థులు వస్తారని అన్నారు. 25 కిలో మీటర్లు ఉన్న ఒంగోలు నగరానికి వచ్చి రోజువారీ పనిచేసుకుని వచ్చేవారు పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలిపారు. ఈ అన్ని అంశాలను గమనంలో ఉంచుకొని రెగ్యులర్ గా బస్ నడపాలని కోరారు. ప్రత్యేకంగా మధ్యాహ్నం 1.30 ఒక ట్రిప్ కావాలని కోరారు. ఆసుపత్రి కి వచ్చిన పేసెంట్లు బస్సు లేనందున 4.30 వరకు ఇక్కడే ఉండాల్సి వస్తుందని తెలిపారు. అక్కడ వారికి టి, టిఫిన్, మీల్స్ అందుబాటులో ఉండదని, ఇంటికి వెళ్ళి తినటానికి చాలా సమయం వేచి ఉండాలని అన్నారు. ఈ అర్జీని పరిశీలించి రెగ్యులర్ బస్సు నడుపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు, పాడు మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య పాల్గొన్నారు.



# సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జులై 23)

మండలంలోని దివిపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. సుపరిపాలనలో భాగంగా ఏడాది పాలనలో ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని, సంక్షేమం, అభివృద్ధి దిశగా రాష్ట్రం ప్రయాణిస్తుందని తెలిపారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు... కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్ లు, మండల టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో చదివితేనే ఏదైనా సాధించగలరు

## ఎస్ఐ నరసింహారావు

(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 23)

ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు అంబేద్కర్ గురుకుల పాఠశాల లో కంభం ఎస్ఐ నరసింహారావు సిబ్బందితో కలిసి విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలు, డయల్ 100, 112 సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.విద్యార్థినులకు గుడ్ టచ్ , బ్యాడ్ టచ్ మధ్య తేడా, స్వీయ రక్షణ పద్ధతులు, ఈవ్ టీజింగ్, ప్రేమ పేరుతో మోసాలు మరియు మహిళలపై జరిగే నేరాలపై మరియుచట్టాలపై, సమాజంలో ఆడపిల్లలు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సవాళ్లపై ఎస్ఐ నరసింహారావు వివరిస్తూ, బంగారు భవిష్యత్తు కోసం ఏవిధంగా ప్రవర్తించాలనే అంశాల గురించి వివరించారు. సైబర్ నేరాల విషయంలో ఫేక్ ఎస్ఎంఎస్‌లు, ఓటీపీ మోసాలు, బ్యాంకు పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, వాట్సప్ ఫేక్ లింకులు, మొదలగునవిసైబర్ నేరగాళ్ల మోసాలు అని ఒకవేళ సైబర్ క్రైమ్ లో బాధితులయితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఫిర్యాదు చేసి తగిన వివరాలు తెలపాలని, కళాశాలల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల విద్యను, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు కోల్పోయే అవకాశం ఉందని గుర్తు చేశారు. క్రమశిక్షణతో చదివితే మాత్రమే ఉన్నత శిఖరాలనుఅధిరోహించగలమని, మీకు ఎవరికైనా మాదకద్రవ్యాల సంబంధిత కార్యకలాపాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రోడ్డు భద్రత విషయాల్లో హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడం, మైనర్లు వాహనాలు నడపకూడదని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని చెప్పారు. తల్లిదండ్రులు మరియు బంధువులు ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వెళ్లాలని చెప్పాలన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా డయల్ 100, 112 కి కాల్ చేయడం ద్వారా పోలీసుల సహాయం పొందవచ్చని ఎస్సై నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థినిలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# మురిసిన మువ్వన్నెల జెండా
# 3600 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన










**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**
ఒంగోలు నగరంలో మువ్వన్నెల జెండా మురిసిపోయింది. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఒంగోలులో 3600 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో భాగంగా ఒంగోలు బైపాస్ రోడ్డు పై ఓవర్ నుండి వేలాది మంది విద్యార్థులు 3600 అడుగుల జాతీయ జెండాను పట్టుకొని ముందుకు భారీ రాల్లీ కదిలారు. కర్నూలు రోడ్డు, ఆర్టీసీ బస్టాండు, అద్దంకి బస్టాండు మీదుగా సభా వేదిక అయిన అద్దంకి బస్టాండుకు చేరుకొంది. వేలాది మంది విద్యార్థులు 3600 అడుగుల జాతీయ జెండా పట్టుకొని ముందుకు కదులుతుండగా, వాతావరణం కూడా చల్లగా ఉండటంతో విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు కదిలారు. భారీగా తయారు చేసిన జాతీయ జెండా నగరంలో విద్యార్థులు ప్రదర్శించడంతో ఒంగోలు నగరం పరవశించిపోయింది. ఈ దృశ్యాన్ని చూసిన ప్రతి ఒక్కరిలో జాతీయ భావం పెల్లుబికింది. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు జాతీయ జెండాను ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. జాతీయ జెండాను చూస్తే ప్రతి భారతీయుడు గర్వంగా ఫీల్ అవుతారని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నాటి స్వాతంత్ర్య సమరంలో రాష్ట్రానికి చెందిన పింగళి వెంకయ్య జాతీయ జెండాకు రూపకల్పన చేశారన్నారు. వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం ఒంగోలులో 3600 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. సేవా కార్యక్రమాలకు వాసవి క్లబ్స్ ప్రతిగా నిలుస్తుందని కొనియాడారు. ప్రతి ఒక్కరూ తన సంపాదనలో పది శాతం పేదలకు ఖర్చు పెడితే ఆ సంతోషం వేరుగా ఉంటుందన్నారు. పేదరికం లేని సమాజం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీ 4 అమలు చేస్తున్నారని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని దామచర్ల జనార్ధన్ రావు కోరారు. జిల్లా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ధైర్య సాహసాలకు ప్రతీక జాతీయ జెండా అన్నారు. దేశం యొక్క గొప్పతనం, విజయానికి జాతీయ జెండా నిదర్శనం అన్నారు. అలాంటి జాతీయ జెండాను 3600 అడుగులతో రూపొందించి ఒంగోలులో ప్రదర్శించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. అద్దంకి బస్టాండ్ లో ఏర్పాటు చేసిన మీటింగ్లో మద్దిపాడు మండల తెలుగు యువత మాజీ అధ్యక్షులు పోతినేని శ్రీనివాసరావు (పి.యస్.ఆర్) గారికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కే. వెంకటేశ్వరరావు, గార్లపాటి శ్రీనివాసరావు, సుజాత రామకృష్ణ, లక్ష్మీ నరసింహ గుప్తా, కనుమర్లపూడి హరి ప్రసాద్, రంగ స్వామి, వెంకట సత్యనారాయణ, రంగనాథ్, సుబ్రహ్మణ్యం, అనిల్ కుమార్, సురేషు, నాగరాజు, పవన్, శ్రీనివాసరావు, సుధాకర్, ప్రసాద్,శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## త్రిబుల్ ఐటీలో సీటు వచ్చిన విద్యార్థికి సన్మానం



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, జులై 23)**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎర్రగొండపాలెం నందు సి.డబ్ల్యూ.ఎస్.ఎన్. విద్యార్థి అయిన షేక్ షా బీర్ భాష త్రిబుల్ ఐటీ నూజివీడులో సీటు వచ్చినందుకు గాను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యు.నాగరాణి, ఎర్రగొండపాలెం విద్యాశాఖాధికారి పి .ఆంజనేయులు, ప్రకాశం జిల్లా ఐఈ కోఆర్డినేటర్ నాగేంద్ర నాయక్, స్పెషల్ ఎడ్యుకేటర్ షేక్ సాదిక్ మాస్టర్ , పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అందరూ త్రిబుల్ ఐటీ లో సీటు వచ్చిన అబ్బాయిని ఘనంగా సన్మానించారు. త్రిబుల్ ఐటీ లో సీటు సంపాదించినందుకుగాను పాఠశాల ఉపాధ్యాయుడైన టి వీరాచారి ఆ అబ్బాయిని అభినందిస్తూ రూ.1000లు బహుమతిగా ప్రకటించారు. మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ జిల్లా మొత్తం మీద సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ సీటు మన మండలం లోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎర్రగొండపాలెం విద్యార్థికి రావడం చాలా గర్వకారణంగా ఉందన్నారు.

## విద్యార్థులకు నేత్ర పరీక్షలు



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 23)**
మండల కేంద్రమైన పొన్నలూరు ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం వైద్యాధికారి డాక్టర్ కృష్ణ చైతన్య అధ్యక్షతన విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి వెంకటేశ్వర్లు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి , కంటి అద్దాలు అవసరమైన విద్యార్థులకు త్వరలోనే కంటి అద్దాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు ఆకుకూరలు, కాయలు పండ్లు అధికంగా తినాలని విద్యార్థులకు తగు సూచనలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రవి కిరణ్, శ్రీకాంత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాస్కరరావు, సూపర్వైజర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 25న సిపిఐ కందుకూరు నియోజకవర్గ 4వ మహాసభ

### సిపిఐ నియోజకవర్గ మహా సభలను జయప్రదం చేయండి



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 23)**
ఈ నెల 25న సిపిఐ కందుకూరు నియోజకవర్గ 4వ మహాసభ జరుగుతుందని ఈ మహా సభలను విజయవంతం చేయాలని కందుకూరు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి బూసి సురేష్ బాబు పిలుపునిచ్చారు. మహాసభల ప్రచారంలో భాగంగా బుధవారం ఓలేటి వారి పాలెం లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ సిపిఐ నియోజకవర్గ మహాసభ శుక్రవారం ఉదయం 10 గంటలకు పామూరు రోడ్డులోని లక్ష్మీ శ్రీనివాస కళ్యాణ మండపంలో జరుగుతుందని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటలకు సిపిఐ కార్యాలయం నుండి ప్రదర్శన ప్రారంభమవుతుందని ఈ ప్రదర్శనలో పార్టీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. నెల్లూరు జిల్లా మహాసభలు ఆగస్టు మూడు, నాలుగు తేదీల్లో నెల్లూరు నగరంలో జరుగుతాయని, సిపిఐ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 20 నుండి 25 వరకు ఒంగోలు నగరంలో జరుగుతున్న ఉన్నాయని రాష్ట్ర, జిల్లా మహాసభలను సైతం విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ మహాసభలలో నరేంద్ర మోడీ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎలా ఎదుర్కోవాలని అంశాలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓటమి ప్రభుత్వం ఇచ్చిన మీద హామీలను నెరవేర్చకపోతే తీసుకునే నిర్ణయాలపై దళితర అంశాల గురించి చర్చించడం జరుగుతుందని మహాసభలకు సిపిఐ జిల్లా పాల్గొని, పలు అంశాల గురించి చెప్పడం జరుగుతుందని ఆయన తెలిపారు. నియోజకవర్గ మహాసభలకు నియోజక వర్గంలో అన్ని మండలాల నుండి సిపిఐ కార్యకర్తలు నాయకులు సానుభూతిపరులు విరివిరిగా పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర మహాసభలు సందర్భంగా శాఖ, మండల, నియోజకవర్గ, జిల్లా మహాసభలు పూర్తి చేసుకోవటం జరుగుతుందని తెలిపారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి పి బాలకోటయ్య, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి వై ఆనంద్ మోహన్, నాయకులు బాల బ్రహ్మాచారి, కే మురళి, సిపిఐ వలేటి వారి పాలెం శాఖ సభ్యులు పిన్నిక అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా సేవ్ కరేడు సేవ్ ల్యాండ్

### ప్రాణాలైనా ఇస్తాం మా భూములు, ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వం



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 23)**
ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ పకితిరేకంగా జీవో నెంబర్43 రద్దు చేస్తూ తక్షణమే బలవంతపు భూసేకరణ నిలిపివేయాలని ( ధర్మారెడ్డి సంఘం ) ఇందిరా నగర్ కాలనీ గ్రామస్తులందరూ ముక్తకంఠంతో తీర్మానం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో కరేడు రైతు గ్రామ కమిటీ నాయకుడు మిరియం శ్రీనివాసులు ,వెంకట్రావు, బుజ్జియ్య ,పోటు వెంగయ్య నల్లపురెడ్డి సుధాకర్ రెడ్డి, కలికి శివారెడ్డి, సిపిఎం నాయకులు ఎస్ ఎం గౌస్ భాష, జీవివి కుమార్, యానాదుల చైతన్య వేదిక కమిటీ సభ్యులు కత్తి బాలకోటయ్య, పొట్లూరి రవి, కత్తి సురేష్, నటరాజు, పొట్లూరు రామయ్య, పొట్లూరు శ్రీనివాసులు, పాస్టర్ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు ఈ యొక్క కార్యక్రమంలో కరపత్రాలు పంచుకుంటూ ఈ యొక్క బలవంతపు భూసేకరణ గురించి గ్రామస్తులకు వివరించారు.

## గోలమారి వెంకటేశ్వరరెడ్డి మృతికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే అన్నా



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 23)**
మార్కాపురం టౌన్ తూర్పు వీధి నందు గోలమారి వెంకటేశ్వరరెడ్డి ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు వెంకటేశ్వరరెడ్డి పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

## అమ్మవారికి సారె సమర్పించిన గూడూరి ఎరిక్షన్ బాబు



**(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జులై 23)**
త్రిపురాంతకేశ్వర స్వామి వారి ఘటాభిషేకం, శ్రీ శాకాంభరీదేవి ఆకార, పార్వతి త్రిపురాంభ దేవి అమ్మవారికి ఆషాడమాస సారె సమర్పణ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కలశాలతో ఘటాభిషేకంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, టీడీపీ కూటమి నాయకులు, పాల్గొన్నారు.

## మంత్రి డోలాకు కృతజ్ఞతలు తెలిపిన ఎనమది వెంకటేశ్వర్లు



**(షణ్ముఖ వెలుగు, కొండపి, జులై 23)**
కొండపి గ్రామానికి చెందిన ఎనమది వెంకటేశ్వర్లు ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటిరింగ్ కమిటీ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం రాష్ట్ర సాంఘీక, సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామికి పూలమాలవేసి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు.

# 15వ డివిజన్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పూర్తి

## కేక్ కటింగ్ నిర్వహించిన టిడిపి నాయకులు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశాలతో 15వ డివిజన్ లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంను100 % విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని డివిజన్ అధ్యక్షుడు గడ్డం ఆదినారాయణ తెలిపారు, డివిజన్లో సుపరిపాలన తొలి అడుగు పూర్తి సందర్భంగా కేక్ కటింగ్ నిర్వహించారు. 166,168,169,170,171,172 బూత్ ఇంచార్జి లకు, సభ్యులకు, పార్టీ కార్యకర్తలకు,నాయకులకు హృదయ పూర్వక అభినందనలు,ధన్యవాదములు తెలియజేశారు ఈ కార్యక్రమం లో ముఖ్య కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్ , తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పొదిలి శ్రీను, తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు హగ్గాయా రాజ్ , క్లస్టర్ ఇంచార్జ్ పాలురి వెంకటేశ్వర రెడ్డి, క్లస్టర్ కో కన్వీనర్ బాబు, అబ్జర్వర్ కాసిరావు, మహిళా అబ్జర్వర్ నిడమానూరి పావని , రాంనగర్ స్కూల్ విద్య కమిటీ చేర్మెన్ యాలటూరి రవి, బీసీ సెల్ కార్యదర్శి యాలటూరి వేణు ,ఐటీడీపి ప్రధాన కార్యదర్శి జగదీష్ , షేక్ సిద్దిక్ (బబ్లు), పాలపర్తి లక్ష్మీనారాయణ, వెంకటేష్, శ్రీను నాయక్, సూతరం గోపి , గుమ్మడి సుహాసిని ,యూనిట్ ఇంచార్జ్ వేణి, సూతరం జ్యోతి, పాల్గొన్నారు. అనంతరం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొని బూత్ ఇంచార్జ్ లుని అభినందించారు. 166 బూత్ ఇంచార్జ్ గడ్డం పోతురాజు, 168 బూత్ ఇంచార్జ్ గడ్డం మహేష్, 169 బూత్ ఇంచార్జ్ గడ్డిపటి మల్లికార్జునరావు, 170 బూత్ ఇంచార్జ్ లక్కవరపు అరుణ, 171 బూత్ ఇంచార్జ్ మువ్వల పోతురాజు, 172 బూత్ ఇంచార్జ్ పసుమర్తి చైతన్యకృష్ణ శాలువాలతో సన్మానించారు.





## అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 23)** అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను




ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి తీసుకోవలసిన చర్యల పై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యత పెంపుకు బహుశాఖల సమన్వయంతో పనిచేయాలన్నారు. అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో వయోజన విద్యా కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. "ఉల్లాస్" – అక్షర ఆంధ్ర కార్యక్రమంలో జీవితాంతం నేర్చుకునే అవకాశాల కల్పన కోసం కేంద్ర ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. మానవ కేంద్రితంగా ఉల్లాస్‌ను అమలు చేయాలని కలెక్టర్ అన్నారు.ఆర్థిక అక్షరాస్యత, సాంకేతిక అక్షరాస్యత, క్రియాత్మక అక్షరాస్యత సాధించే దిశగా అడుగులు వేయాలని ఆయన చెప్పారు. అక్షర ఆంధ్ర అమలులో వలంటీర్లు , ఉపాధ్యాయులు, విద్యాసంస్థల పాత్ర కీలకమని ఆయన అన్నారు. అక్షర ఆంధ్ర కార్యక్రమం పటిష్టంగా నిర్వహించడానికి అందరూ సహక రించాలని ఆయన కోరారు. అక్షర ఆంధ్ర కార్యక్రమం స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం తో అమలు చేయాలని ఆయన చెప్పారు. జిల్లాలో పి4 మార్గదర్శకులతో గ్రామాలలో ఉన్న నిరక్షరాసులను మ్యాపింగ్ చేయాలన్నారు. నిరక్ష్యరాసులపై మార్గదర్శకుల పర్యవేక్షణ ఉండాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ నరసింహారావు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గుత్తి మాన్విత పుట్టిన రోజు వేడుకలో ఎంపీటీసీ ఆకుపాటి



**(షణ్ముఖ వెలుగు, పామూరు, జులై 23)**

పట్టణంలోని అనిల్ గార్డెన్స్ నందు బుధవారం గుత్తి మనోహర్ కుమార్తె మాన్విత మొదటి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్, బాలాజీ జ్యువెలర్స్ అధినేత గుత్తి రాజ, నీరుకట్టు రసూల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొని మాన్వితని ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన పొదిలి జనసేన నాయకులు శ్రావణి వెంకటేశ్వర్లు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 23)**

ఒంగోలులో హరిహర వీరమల్లు సినిమా తరుపున వేయించిన బాలినేని ఫ్లెక్సీల తొలగింపు సందర్భంగా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డికి మద్దతు తెలుపుతూ బుధవారం ఒంగోలులోని ఆయన నివాసంలో జనసేన నాయకులు శ్రావణి వెంకటేశ్వర్లు వారిని కలిసి గజమాలతో సత్కరించారు. అనంతరం జనసేన పార్టీ కార్యక్రమాల గురించి, తదుపరి కార్యాచరణ గురించి చర్చించారు.




## ఘనంగా జాతీయ నేతల జయంతి

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 23)**

మార్కాపురంలోని శ్రీ కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీలో బుధవారం స్వాతంత్ర్య సమరయోధులు చంద్రశేఖర్ ఆజాద్, బాల గంగాధర తిలక్ జయంతులను పురస్కరించుకొని నివాళు లర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత మహా నాయకుల చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. దేశం కోసం వారి చేసిన త్యాగాలు విద్యార్థుల్లో దేశభక్తిని నూరి పోసేలా ప్రేరణ కలిగించాయని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు, విభాగాల శాఖాధిపతులు, బోధన సిబ్బంది మరియు అనేకమంది విద్యార్థులు పాల్గొన్నారు. వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ 'మహనీయుల జీవితాలు యువతకు మార్గదర్శకంగా నిలవాలి. తిలక్ విద్యా సేవలు, ఆజాద్ బలిదానం అనిర్వచనీయం. విద్యార్థులు తమలోని సామాజిక బాధ్యతను గుర్తించాల్సిన అవసరం ఉంది" అని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ మాట్లాడుతూ "విద్యార్థుల్లో దేశభక్తి, పౌర బాధ్యత, సేవామనోభావాన్ని పెంపొందించేందుకు ఈ తరహా కార్యక్రమాలు ఎంతో అవసరం. ఎన్‌ఎస్‌ఎస్ గమ్యం, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడటమే" అని తెలిపారు.

**విద్యార్థులకు ప్రిన్సిపాల్ సందేశం:**

"మీరందరూ విద్యా బుద్ధులతో పాటు దేశ సేవకు సన్నద్ధంగా ఉండాలి. చరిత్రలో నిలిచిన వీరుల స్ఫూర్తిని అనుసరించి, నిజాయితీ, ధైర్యంతో మీరు ఎదగాలని కోరుతున్నాం. కళాశాల వేదికగా జరిగే ఈవిధమైన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడం ద్వారా మీలో సామాజిక అవగాహన పెరుగుతుంది."

## బలవంతపు భూసేకరణ ఆపాలి కరేడు రైతుల ఆందోళన




**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 23)**

మండలంలోని కరేడు గ్రామంలో విండో సెల్ కంపెనీ కోసం జరుగుతున్న భూసేకరణ ఆపాలని జీవో నెంబర్ 43 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు కరేడు రైతులు నెల్లూరు జడ్పీ కార్యాలయంముందు నిరసన చేయడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు డిఆర్‌సి మీటింగుకు వచ్చిన మంత్రులకు శాంతియుతంగా వినతి పత్రాలు ఇస్తామని చెప్పిన రైతులను పోలీసులు కలవనీయకపోవడం దారుణమన్నారు. మంత్రులను కల్పిస్తామని చెప్పి దాదాపు నాలుగు గంటలసేపు రైతులను అడ్డుకొని చివరకు కలవనీయకుండా బలవంతంగా నిలిపివేశారన్నారు. ఈ సందర్భంగా కరేడు భూ సేకరణ వ్యతిరేక కమిటీ నాయకుడు మిరియం శ్రీనివాసులు మాట్లాడుతూ పరిశ్రమల కోసం జిల్లా మొత్తం మీద 52,000 ఎకరాలు భూసేకరణ చేసిందని దానిలో పదివేల ఎకరాలు పరిశ్రమలకు స్థాపించారు. మిగిలిన 42,000 ఎకరాలను ఏ విధంగానూ ఉపయోగించడం లేదన్నారు. మూడు పంటలు పండే భూముల మీద పరిశ్రమలు కడతామని అనడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, పిడిఎస్‌యూ అధ్యక్షులు సునీల్, బొమ్మిరెడ్డి పవన్‌రెడ్డి, దగ్గుమాటి సీతారాంరెడ్డి, చింతం వెంకటరెడ్డి, బొడ్డు శ్రీధర్‌రెడ్డి, వాకా శేఖర్‌రెడ్డి, కత్తి బాలకోటయ్య,

## మాదకద్రవ్యాల పై విద్యార్థులకు అవగాహన కల్పించిన సిఐ వెంకటేశ్వర్లు





**(షణ్ముఖ వెలుగు , పొదిలి, జులై 23)**

పొదిలి పట్టణంలోని విశ్వనాథపురం సెంటర్‌లో గల ఆల్ఫా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య మాదకద్రవ్యాల పై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వి వేమనలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్ఫా స్కూల్ యాజమాన్యం. విద్యార్థులు మాదక ద్రవ్యాల విషయంలో దూరం పాటించాలన్నారు. లేకపోతే జీవితాలు నాశనమైపోతాయని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి రావాలన్నారు. అన్ని రంగాలలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వేమనలను పాఠశాల యాజమాన్యం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జులై 23)**

సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పుల్లలచెరువు ఎస్ఐ సంపత్ కుమార్ అన్నారు. స్థానిక జిల్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతు న్నారని ఇలాంటి సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలన్నారు.విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించి మాట్లాడారు.మహిళలు,చిన్న పిల్లలపై నేరాలు ఎక్కువయ్యాయన్నారు. విశృంకల పాశావికమైన ఆలోచనల విధానాల వలన ఇటువంటివి చోటు చేసుకుంటున్నాయని, వీటి కట్టడికి చట్టాల ద్వారానే కాక మానవుల మనస్సుల్లో మార్పు రావాలన్నారు.విద్యార్థి దశ నుంచే ఏది మంచిది ఏది చెడ్డది ఆలోచించే విధానం కలిగి ఉండాలి అని ఆయన అన్నారు.అలాగే సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష లైంగిక వేధింపుల గురించి తెలియజేశారు.మహిళలు చురుకుగా ఉండాలని లైంగిక వేధింపులకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# పరిశ్రమలు తరిమేసింది మీరే రైతులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదు

ప్రభుత్వం 4500 ఎకరాలు మాత్రమే సరిపోతుందని కలెక్టర్ చెప్పింది వాస్తవం కాదా
20,000 ఎకరాలు తీసుకుంటున్నారని
వైసిపి నాయకులు అసత్య ప్రచారాలు ఎందుకు చెబుతున్నారు
పరిశ్రమలు తీసుకువచ్చి స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వటం
వైసీపీ నాయకులకు ఇష్టం లేదా
నెల్లూరు జిల్లా సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





(షణ్ముఖ వెలుగు , కందుకూరు, జులై 23)

జిల్లాకు వచ్చిన పరిశ్రమలను జే టాక్స్ పేరుతో తరిమివేసిన మాట వాస్తవం కాదా అని వైసిపి ఎమ్మెల్సీ తూమాటి మాధవరావును కందుకూరు శాసనసభ్యులు నాగేశ్వరరావు నిలదీశారు.. నెల్లూరు లో బుధవారం జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అధ్యక్షతన జరిగిన జిల్లా సమీక్ష సమావేశంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ ,జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామ నారాయణ రెడ్డి, జిల్లా ఇతర శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులతో కలిసి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం జిల్లాకు వచ్చిన పరిశ్రమలన్నిటిని బెదిరించి పంపించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు.. గతంలో 2018లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జిల్లాకు వచ్చిన భారీ పరిశ్రమ ఏపీపి తరిమివేసినది మీ వైసిపి ప్రభుత్వమే కదా అని ఘాటుగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మీద నమ్మకంతో రాష్ట్రానికి మరియు జిల్లా కి భారీ పరిశ్రమలు వస్తున్నాయని, అది చూసి ఓర్చుకోలేని వైసిపి ప్రభుత్వం ఏదో విధంగా బురద జల్లే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఇండోసోల్ కంపెనీకి సంబంధించి కరేడు ప్రాంతంలో మొత్తం 19 గ్రామాలు ఉండగా 3 గ్రామాల్లో కేవలం 4,500 మాత్రమే ప్రభుత్వం తీసుకుంటుందని, మూడు పంటలు పండే భూములు జోలికి వెళ్ళబోమని జిల్లా కలెక్టర్ తెలియజేశారని ఎమ్మెల్యే తెలిపారు. కానీ వైసీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు రైతులు తప్పుదోవ పట్టించేందుకు ప్రభుత్వం 20,000 ఎకరాలు తీసుకుంటుందని రైతుల్లో లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు కాలనీ కేటాయిస్తే కనీసం వారికి మౌలిక వసతులు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ కాలనీలో నూతనంగా సిమెంట్ రోడ్లు డ్రైన్లు నిర్మించామని తెలిపారు. కరేడు ప్రాంతంలోని రైతులు వారికి నచ్చిన చోట =% కాలనీ నిర్మించి అన్ని మౌలిక వసతులు కల్పించాక మాత్రమే పరిశ్రమల కోసం ప్రభుత్వం భూమి తీసుకుంటుందని తెలియజేశారు.. స్థానికంగా భూమి ఇచ్చిన రైతులకు ఏటువంటి నష్టం జరగకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చించి నష్టపరిహారం ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నామని, ముందుగా స్థానిక నిరుద్యోగ యువతకు భారీ సంఖ్యలో ఉద్యోగాలు వస్తాయని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలియజేశారు.

కందుకూరు పట్టణంలోని ఏరియా హాస్పిటల్ లో విషయంలో జిల్లా వైద్యశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏ జిల్లా కిందికి వస్తుందో తెలియని విధంగా ఆరోగ్యశాఖ అధికారులు ప్రవర్తిస్తున్నారని, ఈ విషయంలో స్థానికంగా హాస్పిటల్లో ఇబ్బందులు నెలకొంటున్నాయని ఎమ్మెల్యే అధికారులు దృష్టి తీసుకెళ్లారు. ప్రభుత్వం విడుదల చేసిన ఆశా వర్కర్ల నోటిఫికేషన్ విషయంలో రెండు జిల్లాల అధికారులు తమ పరిధి కాదంటూ కాలయాపన చేస్తున్నారని వైద్యశాఖ అధికారులు తీరును విమర్శించారు.. మొత్తం మా నియోజకవర్గంలో 23 ఆశా వర్కర్లు పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని పూర్తి స్థాయిలో భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గంలో ప్రభుత్వం పేదల కోసం నిర్మించే కాలనీ ఇళ్ల విషయంలో ఎస్సీ కాలనీలో పొజిషన్ సర్టిఫికెట్లను త్వరగా మంజూరు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఆపరేషన్ సింధూర్ పై ఎన్‌సిసి క్యాడెట్స్ అవగాహన

పాల్గొన్న వివిధ కళాశాల, పాఠశాల స్టూడెంట్లు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)

ఆపరేషన్ సింధూర్ పేరుతో ప్రత్యర్థి దేశ తీవ్రవాదుల దాడిని భారతదేశ సైన్యం ఎలా ఎదుర్కుందో ఎన్.సి.సి క్యాడెట్లకు వివరించారు 34ఏ ఎన్ సీసీ బెటాలియన్ ఒంగోలుకు చెందిన కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ మోహన్ ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కాలేజిలో ఆపరేషన్ సింధూర్ పై అవగాహన కల్పించారు. కళాశాలలోని విశ్వేశ్వరయ్య సెమినార్ హాలులో బుధవారం ఈ కార్యక్రమం జరిగినట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి తెలియజేశారు. అసలు జమ్మూ కాశ్మీర్ లో పరిస్థితులు ఎలా ఉంటాయి? పెహల్గామ్ లో అటాక్స్ ఎలా జరిగాయి. ఆ తర్వాత ఆపరేషన్ సింధూర్ ని ఎలా నిర్వహించారు? మన వాళ్లు పాకిస్థాన్ సైనికులను ఎలా ఎదుర్కొన్నారు? తదితర అంశాలపై క్యాడెట్స్ కి తెలియజేశారు. ఎన్ సీసీ క్యాడెట్లు విపత్కర పరిస్తులలో డిఫెన్స్ లో భాగస్వామ్యులు కావాలి అంటే ఇలాంటి విషయాలు పై అవగాహన పెంచుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో క్విస్ కళాశాల ఎన్ సీసీ క్యాడెట్లతో పాటు క్విస్ స్కూల్ ఎన్ సీసీ క్యాడెట్లు, వివిధ కళాశాలలకు చెందిన 400 మంది ఎన్ సీసీ క్యాడెట్లు హాజరయ్యారు.

# నాయుడు పల్లి, పెద్ద యాచవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది




(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 23)

మండలంలోని నాయుడుపల్లి, పెద్ద యాచవరం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిని బుజ్జి బాయ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పడిన వర్షాలకు పొలాలు పదునైనందున మెట్ట పంటలు కంది, మినుము సాగు చేసుకోవాలని అని సూచించారు. ప్రధాన పంటగా కందిని అంతర పంటగా మినుముని సాగు చేసుకోవాలని తెలియజేశారు. వాణిజ్యపరమైన పంటలు మిరప ,పొగాకు సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకోవాలని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అందించినటువంటి కిసాన్ డ్రోన్ పథకాన్ని రైతులకు వివరించారు. ప్రభుత్వం వారు 80 శాతం సబ్సిడీతో మండలానికి ఒక డ్రోన్ ని గ్రూప్ సభ్యులకు అవకాశం కల్పించారు. డ్రోన్ వలన రైతుల తమ పంటలకు పురుగు మందులను పిచికారి చేసుకోవడానికి వీలవుతుందని తెలిపారు. కౌలు రైతులకు సిసిఆర్సి కార్డ్స్, ఖరీఫ్ పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, ఈ పంట నమోదు గురించి రైతులకి అవగాహన కల్పించారు. ఈ పంట నమోదు చేయించుకోవడం వలన ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం నుంచి క్రాప్ఇన్సూరెన్స్ పొందడానికి, పండించిన పంటను అమ్ముకోవడం కొరకు ఈ పంట నమోదు ఉపయోగపడుతుందని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపల్లి, పెదయాచవరం విఏఏలు ముని కాశయ్య, గురవయ్య, ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

# బేతున్ నర్సింగ్ హోమ్ నందు అగ్ని ప్రమాదం

ఆపరేషన్ థియేటర్ ఒక్కసారిగా శబ్దంతో కూడిన మంటలు
ఒక్కసారిగా భయాందోళనలకు గురైన పేషెంట్‌లు
మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)

ఒంగోలు నగరంలోని మంగమూరు రోడ్డులోని బేతున్ నర్సింగ్ హోమ్ నందు అగ్ని ప్రమాదం సంభవించింది. సుమారు మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో ఆపరేషన్ థియేటర్ ఒక్కసారిగా శబ్దంతో కూడిన మంటలు వ్యాపించడంతో ఆసుపత్రిలోని ప్రజలందరూ ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. హాస్పిటల్లో ఉన్నటువంటి అగ్నిమాపక ప్రమాద పరికరం ద్వారా మంటను అదుపు చేసేందుకు ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో హాస్పిటల్లో ఉన్నటువంటి ఇన్ పేషెంట్లు అవుట్ పేషెంట్లు ఒక్కసారిగా ఏం జరుగుతుందో తెలియక ఆకస్మిక భయానికి గురయ్యారు. వెంటనే విపత్తుల అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వటంతో రంగంలో దిగిన అగ్రిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. ఒక్కసారిగా దట్టమైన పొగ రావడంతో ఏం జరుగుతుందో తెలియక గందరగోళం నెలకొంది. ఆపరేషన్ థియేటర్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో జరిగిన ఈ అగ్నిప్రమాదం కారణంగా ఆసుపత్రి మొత్తం దట్టమైన పొగ వ్యాపించింది. అగ్నిమాపక శాఖ అధికార యంత్రాంగం రంగంలోకి దిగి మంటలను అదుపు చేసి ఉన్నటువంటి పొగ బయటికి పంపించే ప్రయత్నం చేశారు. దీంతో చుట్టుపక్కల ప్రజలతో పాటుగా ఆసుపత్రిలో ఉన్న పేషెంట్లు ఊపిరి పీల్చుకున్నారు. ఐసీఐలో ఉన్న పేషంట్లను, ఆపరేషన్ చేసిన చంటి బిడ్డల తల్లులను వెంటనే ఆసుపత్రి సిబ్బంది సహకారంతో సురక్షిత ప్రాంతానికి తరలించారు.





# కొనసాగుతున్న రాజ్యాంగ అవగాహన పోటీలు

కొండపి, కందుకూరు మండలాల నుంచి హాజరైన విద్యార్థులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)

ఒంగోలు మీడియా కెమెరామన్ అసోసియేషన్ హాల్లో ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక, ఓపిడిఆర్, ప్రజా సంఘాలు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం- కనీస అవగాహన వక్తృత్వ పోటీలు కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన ఈ పోటీలకు కొండపి మండలం ముప్పవరం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు,కందుకూరు మండలం మాచవరం జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు మాట్లాడుతూ ప్రజలలో భారత రాజ్యాంగం పట్ల అవగాహన కల్పించేందుకు ఈ పాటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉంటే భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకోవాలని, ఈ పోటీలు ఈనెల 26వ తేదీ వరకు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు ,గడ్డం మురహరరావు, విశ్రాంత ఉప కలెక్టర్ పల్లపాటి పేరయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు, కేఎన్పిఎస్ జిల్లా సంయుక్త కార్యదర్శి మేడికొండ జార్జి, కొండపి మండలం ముప్పవరం ఆంగ్ల ఉపాధ్యాయులు రవీంద్ర, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

## మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 23)
మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు.బుధవారం కనిగిరి లోని బీసీ-2 హాస్టల్ ను మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ టాయిలెట్లను పరిసర ప్రాంతాలను పరిశీలించ్చారు.అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన రుచికరమైన పౌష్టికాహారం అందించాలని ఆయన తెలిపారు.

# బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 23)
మే నెలలో జరిగిన ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన జీతభత్యాలను రెండు నెలల నుండి అందక ఉపాధ్యాయులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు కావున ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా వారికి జీతభత్యాలను వెంటనే చెల్లించాలని ఎస్టియు జిల్లా అధ్యక్షులు కే ఎర్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం మార్కాపురం మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం అమ్మవారి పల్లి శివరాంపురం కొండేపల్లి మాల్యవంతునిపాడు భూపతి పల్లి బొందలపాడు, మిట్టమీదిపల్లి తిప్పాయపాలెం, చింతగుంట కొత్తపల్లి కోల భీముని పాడు జమ్మనపల్లి గ్రామాలను సందర్శించి ఉపాధ్యాయులచే సంఘంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల యొక్క సమస్యలను సేకరించడమైనది అందులో భాగంగా ఉపాధ్యాయులకు స్పాట్ వాల్యూషన్ నందు చెల్లించవలసిన రెన్యూనరేషన్ చెల్లించాలని, ఉన్నత పాఠశాలలో రిలీవర్ లేక ఇబ్బంది పడుతున్న సబ్జెక్ట్ టీచర్లను పిఎస్ హెచ్ఎంలుగా ఉన్న వారిని తాత్కాలికంగా అయినా డిప్యూటేషన్ వేసి పదవ తరగతి విద్యార్థులకు బోధనలో ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వంలో అదనపు తరగతుల నిర్మాణంలో నిలిచిపోయిన వాటిని సత్వరమే పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు సరైన వసతులను కల్పించాలని, అప్గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలో మోడల్ ప్రాథమిక పాఠశాలకు మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షులు తూంపాటి వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కె యూసఫ్, షరీఫ్, జిల్లా కౌన్సిలర్ పి అల్లూరయ్య, జిల్లా కార్యదర్శి అక్కల నారాయణ, మండల శాఖ గౌరవాధ్యక్షులు కేటి రమేష్‌లు పాల్గొన్నారు.

# కుంచేపల్లి గ్రామంలో విత్తనాలు అందజేత



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 23)
మండలంలోని కుంచేపల్లి గ్రామంలో రైతులకు సామూహిక ప్రదర్శన క్షేత్రాలు పథకం క్రింద 100 ఎకరాల్లో ఎల్ఆర్‌జీ-52 (అమరావతి) అను కంది రకం విత్తనాలు, 13.0.45 నీటిలో కరుగు ఎరువు, ఏమామెట్టిన్ బెంజ్యోట్ పురుగు మందులను రైతులకు ఉచితంగా కృషి విజ్ఞాన కేంద్రం, దర్శి వారి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు) ద్వారా రైతులకి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఎల్ఆర్‌జీ-52 అను కంది రకం పంట కాలం 160-170 రోజులు, ఎకరాకి 5-6 క్వింటలు దిగుబడి వస్తుంది అని తెలిపారు. ఎండు తెగులుని కొంతవరకు తట్టుకుంటుంది అని తెలిపారు. కంది పంటలో తీసుకోవాల్సిన సమగ్ర పంట యాజమాన్య పద్ధతులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పొదిలి మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

# హరిహర వీరమల్లు ప్రీమియర్ షో సందర్భంగా కూటమి పార్టీల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

## ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)
బుధవారం సాయంత్రం ఒంగోలు నగరంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ చిత్రం హరిహర వీరమల్లు విడుదల సందర్భంగా ఒంగోలులోని అద్దంకి బస్టాండ్ వద్ద నుండి రవి ప్రియ మాల్ వరకు కూటమి పార్టీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్‌రావు హాజరయ్యారు. అనంతరం రవి ప్రియ మాల్‌లో భారీ కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ చిత్రం హరిహర వీరమల్లు ఘన విజయం సాధిస్తుందని తెలిపారు. నాలుగేళ్ళ తర్వాత ఆయన వెండితెర పై కనిపిస్తుండడంతో ప్రజలు, అభిమానులు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్, ప్రకాశం జిల్లా జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్, బీజేపీ నాయకులు, కూటమి పక్ష నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంత లక్ష్మి



(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, జులై 23)
మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంత లక్ష్మి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గతంలో అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స చేయించుకున్న రోగులకు సీఎం సహాయ నిధి నుండి విడుదలైన చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో ఆమెకు ప్రజలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. చెక్కులు పొందిన వారిలో పోతిరెడ్డి వెంకట రాములు రూ. 65,000, గంగుల సుబ్బారావు రూ. 40,911, సానికొమ్మ వెంకటేశ్వరరెడ్డి రూ. 83,376 , బొజ్జ హొసన్న క్రౌన్ రూ. 1,05,000, తన్నీరు ఎలమంద రూ. 33,732, నాగం వెంకటనారాయణ రూ. 33,332, ఆరికట్ల మల్లికార్జున రూ. 1,04,229, బొబ్బ శ్రీను రూ. 37,280, అంబోరు కృష్ణకుమారి రూ. 20,000, ఎద్దుల శివ రూ. 30,000, పత్రా వెలుగొండ రాయుడు రూ. 51,174, తరిటే చెంచయ్య రూ. 35,000, తమ్మిశెట్టి శ్రీనివాసులు రూ. 60,000, సాని కొమ్ము ఆదెమ్మ రూ. 1,21,329, నుసుము చెన్నమ్మ రూ. 55,250, గోపిశెట్టి బ్రహ్మయ్య రూ. 71,900, గోపిరెడ్డి పుల్లారెడ్డి రూ. 45,688 మొత్తం రూ. 9,93,201 పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్ (బూన్), మాజీ మండల పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ముప్వ కాటం రాజు, వెంకటేశ్వరరెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.



# దళితవాడల్లో విద్యార్థులకు జరిగిన అన్యాయం పై ఫిర్యాదు

(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జులై 23)
మండలంలో 15 పాఠశాలలో తరగతుల విలీనం లో భాగంగా 12, దళితవాడల్లో పాఠశాలలు విలీనం జరిగాయని,ఇందులో ఎనిమిది పాఠశాలలు కనీస నిబంధనలు పాటించకుండా విలీనం చేశారని, దళితులకు విద్యను దూరం చేసే చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ ను మరియు విద్యాశాఖ కమిషనర్ను కలిసి సమస్యల విన్నపించినట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మంగంపల్లి విద్యా కమిటీ చైర్మన్ భర్త కమలాకర్ నందా గరటయ్య తదితరులు కలిసిన వారిలో ఉన్నారు. అనురామాల్యాద్రి మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలు స్థానిక మండల విద్యాశాఖ అధికారి తుంగలో తొక్కారని ఆరోపించారు.నాలుగు కిలోమీటర్ల నుండి రెండు కిలోమీటర్ల వరకు దూరంలో ఉన్నటువంటి పాఠశాలలను మార్గ మధ్యలో వాగులు స్మశానాలు ప్రమాదకరమైనటువంటి అడవి జంతువులు తిరిగేటువంటి చెరువు కట్టలు కోతులు విష సర్పాలు సంచరించేటువంటి బాటలో నుంచి రోజు వారి విద్యార్థులు 8 కిలోమీటర్ల నుండి నాలుగు కిలోమీటర్ల వరకు నడుచుకుంటూ రావాల్సిన దుస్థితి ఈ అధికారి నిరంకుశ చర్యల వల్ల ఏర్పడిందన్నారు. ఏ ఒక్క గ్రామంలో కూడా విద్యా కమిటీ ఆమోదం లేదని విద్యా కమిటీ ఆమోదం లేకుండా తల్లిదండ్రుల సమావేశపరచకుండా ఎలా విలీనం చేస్తారని ప్రశ్నించారు. ఎండాకాలం వస్తే మండు టెండల్లో విద్యార్థులు నడసి పోవాల్సి వస్తుందని ఆవేదన చెందారు. తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలను ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఎక్కువమంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో విలీనం చేయాల్సి ఉండగా దళితవాడల్లో ఎక్కువమంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఈ విషయంలో కులవ్యవక్షతను అంటరానితనాన్ని ఎంఈఓ ప్రత్యక్షంగా చూపించారని వీరు ఆరోపించారు.వెంటనే విద్యాశాఖ కమిషన్ ఎస్సీ ఎస్టీ కమిషనర్ సమస్యను పరిష్కరించాలని వీరు డిమాండ్ చేశారు. ఎంఈఓ మీద చర్యలు తీసుకోవాలని కొరారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ కమిషనర్ చైర్మన్ మాట్లాడుతూ 15 రోజుల్లో మీకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.




# భీమవరంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 23)
మండల పరిధిలోని భీమవరం 1 ,2 రైతు సేవ కేంద్రాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.విజయకుమార్ ,మండల ఉద్యాన అధికారి వి.విశాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన సందర్భంగా మండలంలోని ఈ పంట నమోదు చేయడం ప్రారంభించినట్లు తెలియజేశారు. రైతులందరూ తమ పొలాలలో సాగు చేసే పంటలను ముఖ్యంగా మామిడి, సపోటా, జామాయిల్, వేరుశనగ మరియు వరి వంటి పంటలను నమోదు చేయించుకోవాలని తద్వారా రైతులకు అన్నదాత సుఖీభవ మరియు క్రాప్ ఇన్సూరెన్స్ వంటి పథకాలకు అర్హత పొందుతారని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో హాజరైనటువంటి రైతులకు ఫాస్ఫరస్ సాల్యుబలైజింగ్ బ్యాక్టీరియా మరియు పాడిపంటలు మ్యాగజైన్లను పంపిణీ చేశారు. మండల ఉద్యాన అధికారి వి. విశాల్ మాట్లాడుతూ ఉద్యాన శాఖలో గల వివిధ రకాల పథకాల గురించి రైతులకు వివరించారు, రైతులు పసుపు, అల్లం వంటి పంటలను సాగు చేయాలని రైతులకు ఎప్పుడు ఏ విధంగా అవసరమైన సాంకేతికపరమైనటువంటి సహాయాన్ని అందించడానికి తమ అందుబాటులో ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ గోడం ఇంచార్జ్ షేక్ మొహమ్మద్ భాష, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# సానిటేషన్ విభాగ పనితీరు గురించి కమీషనర్ రివ్యూ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)

నగరంలోని అన్ని సచివాలయముల శానిటరీ సెక్రటరీస్‌తో సానిటేషన్ విభాగ పనితీరు గురించి బుధవారం కమీషనర్ కె వెంకటేశ్వరరావు రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ సచివాలయ ట్రాన్స్ఫర్స్ పూర్తి అయ్యి వారం రోజులు అయింది కనుక అందరూ సెక్రటరీలు వారి సచివాలయ పరిధిలో గల అన్ని ఇండ్లకు వెళ్లి ప్రజలతో ఇంటరాక్ట్ అవ్వవలసిందిగా ఆదేశాలు ఇచ్చి ఉన్నారు. అదే సమయములో ప్రతి ఇంటి నుంచి కూడా ప్రతి రోజు వర్కర్స్ వారి ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతోంది లేదో అని తెలుసుకొని ప్రతి రోజు చెత్త సేకరణ జరిగేలా చూసుకోవాలి అని ప్లాన్ చేసుకోవాలి అని ఆదేశాలు ఇచ్చారు. ప్రతి వారం నిర్వహించి రివ్యూ సమావేశం లో సానిటేషన్ గురించి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తున్నారు అని, కాల్స్ ద్వారా వారు ప్రజల నుంచి అభిప్రాయములు సేకరిస్తున్నారు. వీటిలో ఒంగోలు నగర సానిటేషన్ విభాగ పనితీరు ఆశించినంత పురోగతి కనిపించటంలేదు సీడీఎంఏ చెప్పారు అని, కనుక ఇక మీదట ప్రతి రోజు కూడా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ మరియు కాలువల క్లీనింగ్ తప్పకుండా చేపించాలి అని శానిటరీ సూపర్వైజర్స్ , శానిటరీ ఇన్స్పెక్టర్స్ మరియు శానిటరీ సెక్రటరీలకు ఆదేశాలు ఇచ్చారు. డ్రైనేజీ క్లీనింగ్ లో అందరూ వర్కర్స్ తప్పనిసరిగా క్లీన్ చేయాలి అని తెలిపారు. అలా చేయని వారి గురించి రిపోర్ట్ చేసిన ఎడల వారి మీద శాఖాపరమైన చర్యలు తీసుకొంటాను అని తెలిపారు. అలానే కాలువల పక్కన పెరుగుతున్న పిచ్చి మొక్కలు కూడా తప్పని సరిగా తీపించి, రోడ్ మీద నుంచి వచ్చిన నీరు కాలువలోకి పోయే విధముగా చూడాలి అని శానిటరీ సెక్రటరీలకు ఆదేశాలు ఇచ్చారు. గత వారం రోజుల నుంచి వర్కర్స్ సమ్మె కారణం గా నిలిచిపోయిన చెత్త సేకరణ, కాలువల క్లీనింగ్ చేపించవలసిందిగా ఆదేశాలు జారి చేశారు. అలానే ప్రతిరోజూ కూడా శానిటరీ సెక్రటరీలు అందరికీ ఉదయం 5:40 గంటల లోపల అందరూ హాజరు అవ్వాల్సిందిగ ఆదేశాలు ఇచ్చారు. అలా చేయని యెడల ఆ సెక్రటరీలకు ఆ రోజు గైర్హాజరు వేయవలసిందిగా అసిస్టెంట్ కమీషనర్, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్‌కి ఆదేశాలు ఇచ్చారు. ప్రతి రోజు కూడా అందరూ సెక్రటరీలు తప్పనిసరిగా వారి సచివాలయ పరిధిలో ఉండవలసిందిగా కమీషనర్ ఆదేశాలు ఇచ్చారు. సచివాలయ పరిధిలో గల గార్బేజ్ పాయింట్స్ ని కన్వర్ట్ చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. అలానే ప్రతి ఇంటి నుంచి కూడా తడి మరియు పొడి చెత్తను వేరు వేరు గా సేకరణ జరిపించాలి అని గౌరవ జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు అని వాటిని తప్పకుండా ఆచరించాలి అని అందరూ సెక్రటరీలకు ఆదేశాలు ఇచ్చారు. ప్రతి పుష్ కార్ట్ మరియు వాటిలో గల చెత్త సేకరణ డబ్బాలను ప్రతి నెల 1 వ తేదీ తప్పనిసరిగా శుభ్రపరుచుకోవాలి అని అందరూ సానిటేషన్ అధికారులుకు సూచించారు. ఈ సారి గౌరవ జిల్లా కలెక్టర్ సానిటేషన్ విజిట్ లో తప్పనిసరా తడి పొడి చెత్త వేరు చేస్తున్నారు లేదో అని పరిశీలిస్తాము అని తెలిపినట్లు కమీషనర్ గారు తెలిపారు. ప్రతి రోజు వర్కర్స్ యొక్క హాజరు పూర్తి అవగానే తరువాత 10 నిమిషాల లోపల వర్కర్స్ అందరూ కూడా వారికి కేటాయించిన లొకేషన్ కి వెళ్లి పని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి అని శానిటరీ సెక్రటరీలకు ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటివరకు వర్కర్స్ యొక్క పిన్ పాయింట్ లొకేషన్ ( ఆయా లొకేషన్‌లో ఇంటి నుంచి చెత్త సేకరణ, కాలువల క్లీనింగ్, రోడ్ క్లీనింగ్) లో గల అన్ని పనులు వర్కర్స్ చేయాలి అని ఆదేశాలు ఇచ్చారు. ప్రతి సానిటేషన్ డివిజన్ వారీగా చెత్త సేకరణ వాహనములు మరియు వాటి డ్రైవర్స్ మరియు లోడర్స్ యొక్క వివరములు ఇవ్వవలసిందిగా శానిటరీ ఇన్స్పెక్టర్స్కి ఆదేశాలు ఇచ్చారు. ప్రతి చెత్త సేకరణ వాహనములో తప్పనిసరిగా బ్లీచింగ్ పౌడర్ పెట్టుకొని గార్బేజ్ లిఫ్ట్ చేసిన తరువాత బ్లీచింగ్ చల్లవాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. ఇప్పుడు వానాకాలంలో కాలువలో లార్వా ని నిర్మూలించేవిదముగా చర్యలు తీసుకోవాలి అని తెలిపారు, దీనికోసం ప్రతి మంగళ వారం తప్పనిసరిగా ఆయా సచివాలయం ప్రాంతంలో తప్పనిసరిగా యాంటి లార్వా చర్యలు చెప్పటవలసిందిగా సానిటేషన్ విభాగం వారికి ఆదేశాలు జారీ చేశారు. ఫైరోసిన్ ద్రావకాన్ని 1:5 నిష్పత్తిలో దోమల యొక్క లార్వా ని నిర్మూలించడంలో వాడాలి అని తెలిపారు. మాలతీయా, డెల్ఫా ద్రావకం ని ఫాగింగ్ కోసం 1:19 నిష్పత్తిలో వాడే విధముగా చూడాలి అని తెలిపారు. ప్రతి ఒక్క సెక్రటరీ కూడా పురమిత్ర అప్ నందు వచ్చిన కంప్లైంట్స్ ని నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయవలసిందిగా ఆదేశాలు ఇచ్చారు. ఈ సారి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు మన ఒంగోలు నగరం కి వచ్చేలా మనం అందరం కలిసి కష్టపడి పనిచేయాలి అని కమీషనర్ తెలిపారు. ఈ రివ్యూ సమావేశంలో కమీషనర్ కె వెంకటేశ్వరావుతో పాటు, అసిస్టెంట్ కమీషనర్ రామ్ భూపాల్‌రెడ్డి , వైష్ణవి, శానిటరీ సూపర్వైజర్స్ పిచ్చయ, బాబ్జీ ,శానిటరీ ఇన్స్పెక్టర్, 70 సచివాలయాల శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

# రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఏవో వెంకటేష్







(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, జులై 23)

మండలంలోని చిలంకూరు, కాకర్ల గ్రామాలలోని రైతు సేవా కేంద్రాల నందు బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ ఖరీఫ్ 2025 సీజన్ నందు పంటల భీమా చేసుకోవడానికి 7 రకాల పంటలను నోటిఫైడ్ క్రాప్స్ గా ప్రభుత్వం వారు గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ నోటిఫైడ్ క్రాప్స్ కి రైతు ప్రీమియం ఒక ఎకరానికి కందికి 430 రూపాయలు, వరికి 860 రూపాయలు, సజ్జకి 156 రూపాయలు, మిరపకి 4500 రూపాయలు, మినుముకి 205 రూపాయలు, నువ్వులకి 180 రూపాయలు, ప్రత్తికి 2100 రూపాయలుగా రైతు ప్రీమియం నిర్ణయించడం జరిగిందని తెలిపారు. మర్రిపూడి మండలంలోని ఖరీఫ్ 2025 సీజన్లో నోటిఫైడ్ పంటలను వేసిన మరియు వేయబోవు రైతులు మీ దగ్గరలోని గ్రామ వ్యవసాయ సహాయకుని (వి ఏ ఏ) సంప్రదించి పంట ధ్రువీకరణ పత్రం పొంది, జులై 31 లోపు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ వద్ద కానీ లేదా మీ సేవ కేంద్రాల వద్ద రైతులు స్వచ్ఛందంగా ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంలోకి రైతులు ప్రీమియం చెల్లించి నమోదు కావాలని తెలిపారు. అనంతరం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలోకి నమోదైన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఎఫ్ యన్ ఎస్, పథకం లో భాగంగా మర్రిపూడి మండలానికి యల్ ఆర్ జి –52 కంది రకం విత్తనం 3639 సంచులను రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు కోటేశ్వరరావు, శ్రీను, చిలంకూరు గ్రామ వ్యవసాయ సహాయకులు వర ప్రసాద్, కాకర్ల గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాసరావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలనే పి4 లక్ష్యం -యాగంటి




(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జులై 23)

ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు సూచనలతో మాచర్ల టౌన్ 15వ వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించిన పి4 సమీక్ష సమావేశ కార్యక్రమంలో కూటమి నేతలతో కలసి మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తరవాత సంక్షేమ పథకాలను, అభివృద్ధి బాటలో రాష్ట్రని ప్రజలను నడిపిస్తూ పేదరికం ఉన్న ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయటమే కోసమే రూపొందించిన పథకం పి4 అని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా భారీ ఎత్తున నిధులు కేటాయించి సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ పేద ప్రజలకు అండగా నిలిచింది కూటమి ప్రభుత్వం. రాష్ట్రంలో ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్న రాష్ట్ర అభివృద్ధి కొరకు రాష్ట్రంలోని రోడ్లకు, నీటి పారుదల ప్రాజెక్టులకు, రాజధాని నిర్మాణం కొరకు భారీ ఎత్తున నిధులు కేటాయించింది నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వమని వెల్లడించారు. రాష్ట్రంలోని పేదరిక నిర్మూలన కొరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నూతన ఆలోచన విధానంలో ఆవిర్భించిన పథకమే పి4 పథకమని మార్గదర్శి మరియు బంగారు కుటుంబం అని వెల్లడించారు. ఈ పి4 పథకం ద్వారా పేదరికంలో ఉన్న చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి కి స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ ఇప్పించి వారికి ఉద్యోగ అవకాశాలు ఉపాధి కల్పించడం మరియు చదువుకున్న విద్యార్థులకు ఉన్నత చదువులు చదువుకోడానికి తోడ్పాటు ఇవ్వడం మరియు స్వయం ఉపాధి ద్వారా చిన్నచిన్న వ్యాపారాలను మరియు కుటీర పరిశ్రమలు పెట్టుకోవటానికి ఈ పి4 పథకం ఆర్థిక సహాయం చేయడమే కాకుండా కులవృత్తులకు వారు కూడా ఆయా రంగాలలో వారికి చేయూతా అందించి వారిని ఆర్థికంగా పైకి తీసుకురాటమే ఈ పి4 పథకం ముఖ్య ఉద్దేశమని యాగంటి మల్లికార్జున రావు మీడియా ముందు వెల్లడించారు. ఆర్థికంగా బలంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు,రాజకీయ నాయకులు, డాక్టర్స్,మరియు స్వచ్ఛంద సేవా సంస్థలు, సమాజంలో ఆర్థికంగా వున్నవారు మన రాష్ట్రములో పేదవారిని దత్తత తీసుకొని వారి కనీస అవసరాలు తీర్చటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అలాగే పి4 పథకం ద్వారా రాష్ట్రంలో ఇల్లు లేని వారికి ఇల్లు నిర్మించి ఇవ్వటమే ప్రథమ లక్ష్యమని మరియు ఎస్సీ, ఎస్టీ బీసీ కార్పొరేషన్ల ద్వారా వారికి ఆర్థికంగా చేయూత ఇవ్వటం జరుగుతుందని పేదరికం లేని సమాజం నిర్మించటమే నారా చంద్రబాబునాయుడు ప్రథమ లక్ష్యమని మరియు ఈ పి4 కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని యాగంటి మల్లికార్జున రావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుల మద్దిగపు వెంకటరామిరెడ్డి, బండ్ల బ్రహ్మం, సచివాలయ అడ్మిన్ శ్రీ లక్ష్మి, పులుసు రఘురెడ్డి, చందు గౌడ్, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# చిన్న కండ్లేరు చెరువు కట్టకు మరమ్మత్తులు చేపట్టాలి



(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జులై 23)

మండల కేంద్రమైన పుల్లలచెరువులో నెలకొన్న చిన్న కండ్లేరు చెరువుకు నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని బుధవారం సిపిఐ పార్టీ బృందం మండల అధ్యక్షులు కందుల వెంకటయ్య. డిప్యూటీ తాసిల్దార్ పుల్లారెడ్డి వారికి మెమోరియల్ అందజేశార . సిపిఐ సీనియర్ నాయకులు టి సి హెచ్ చెన్నయ్య మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రితం వర్షాలు కురిసిన సందర్భంలో చిన్న కండ్లేరు చెరువు కట్టకు గండిపడి వృధాగా నీరు పోవడం జరిగింది. అప్పటి ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే మంత్రివర్యులు చెరువుకట్టును పరిశీలించి తాత్కాలికంగా గండిని పూడ్చడం జరిగింది . ఇప్పటికీ సదరు గండి నుండి నీరు లీకేజీ జరుగుతున్నది అప్పటి మంత్రి నిధులు కేటాయించి మరమ్మతులు చేస్తామని రైతులకు వాగ్దానం నీటి మూటలుగా మిగిలినది. చెరువు కుడి. ఎడమ తూములు మరియు చెరువు కట్టపై ఉన్న చిల్లకంపలను తొలగించి. చెరువు కట్ట అభివృద్ధి పనులు చేయాలని ఆయన అన్నారు. ఈ సంవత్సరం రుతుపవనాలు విస్తారంగా ఉంటాయని శాస్త్రవేత్తలు ముందుగానే తెలియజేశారు దానివలన వర్షాలు వల్ల చెరువు నిండిన చో నీరు అంతా కూడా వృధా అవుతుందని దానివలన చేరువు కింద వ్యవసాయం చేసే భూమి కూడా పంట వేసిన నిరుపయోగంగా మారే ప్రమాదం ఉంది. చెరువు కింద వున్న ఆయకట్టు రైతులు ప్రభుత్వాలు మారిన చెరువును గాలికి వదిలేసారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పరిధిలోకి చిన్న కండ్లేరు చెరువును తీసుకురావాలని ఓ పక్క రైతులు , తీగలేరు సాధన సమితి సభ్యులు పోరాటం చేస్తున్న ఈ చెరువును గుర్తించి నీటిపారుదల అధికారులు ప్రజా ప్రతినిధులు రైతుల పట్ల శ్రద్ధ వహించి నిధులు కేటాయించి శాశ్వతంగా గండిని పూర్తి పంట కాలువల కు మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని సిపిఐ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె వి కృష్ణ గౌడ్, పుల్లలచెరువు సిపిఐ మండల కార్యదర్శి గురునాథం, కంచర్ల గురవయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తోంది కార్యక్రమం అపహాస్యం

## చదును చేసిన అదును కుదరలే

## "వ్యయ గాయం"గా మారిన వ్యవసాయం



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జులై 23)

మండలంలోని వివిధ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుగుతుంది. భూసార పరీక్షలు చేసి తగిన పంటలు వేయాల్సిన పరిస్థితులలో అటువంటి అవకాశం లేకుండా పోయింది. పచ్చి రొట్ట విత్తనాల సరఫరా చేయడం లేదు. నాణ్యమైన విత్తనాలు వ్యవసాయ శాఖలో అందుబాటులో లేవు. అధికారులు రైతు భరోసా కేంద్రంలో రైతులను కూడ గట్టి పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుపుతున్నారు. ఎక్కడ కూడా పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరగటం లేదు. సరైన సమయానికి అదును కుదరక రైతులు పంటలు వేయలేదు. ఈ పాటికి సజ్జ వేయాల్సింది ఏ గ్రామాన కూడా పైరు వేయలేదు. పండించిన పంటలకు మినుము కంది గిట్టుబాటు ధర లేక అల్లాడిన రైతన్నలు. క్వింటాలు 5వేలకు అమ్ముకున్న రైతులు గిట్టుబాటు ధరలు కల్పించని ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల వైపు ముగ్గు చూపించని అధికారులు. పై అధికారులకు ఫీడ్బ్యాక్ ఇవ్వటంలో వ్యవసాయ అధికారుల నిర్లక్ష్య వైఖరి వ్యవసాయ శాఖలో గ్రోమోర్ ద్వారా ఎరువులు విత్తనాలు తగినన్ని అందుబాటులో లేవని ప్రైవేటు షాపులలో నకిలీ మందులు ఎక్కువయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.



# మార్కాపురం ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించిన ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 23)

మార్కాపురం ఎక్సైజ్ స్టేషన్‌ను బుధవారం ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ కె హేమంత్ రాజు, ఒంగోలు ఈ ఎస్ ఆయేషా బేగంలు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు స్టేషన్‌లో ఉన్న రిజిస్టర్లు, కేసుల నమోదు, సీజ్ వివరాలు, యాప్ వినియోగం వంటి అంశాలను సమీక్షించారు. అలాగే నవోదయం 2.0 కార్యక్రమాన్ని పర్యవేక్షించి, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితంగా పరిష్కరించవలెనని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. అనంతరం వారు ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిపోను సందర్శించారు. అక్కడ స్టాక్ రికార్డులు, డిపో నిర్వహణను పరిశీలించి, బాటిల్ క్యాపుల ధ్వంస కార్యక్రమాన్ని కూడా స్వయంగా నిర్వహించారు. ఈ పర్యటనలో స్టేషన్ హౌస్ ఆఫీసర్, డిపో మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు. అధికారుల సూచనలతో, పనితీరు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## సూదనగుంట, తుమ్మగుంటలో పొలం పిలుస్తుంది





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 23)

మండలంలోని సూదనగుంట, తుమ్మగుంట రైతు సేవా కేంద్రం నందు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. అలాగే ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ లో వేసినటువంటి పంటలకు తప్పనిసరిగా అందరూ క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ సంబంధించి రైతు వాటాగా కందికి పంటకి ఎకరాకి రూ.430, సజ్జ రూ.156, వరి పంటకు రూ.860 చెల్లించాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు తెలియజేశారు. మండలంలోని కుంచేపల్లి గ్రామంలో ఖుషి విజ్ఞానం కేంద్రం వారు సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రం ద్వారా ఎల్ఆర్జీ×52 కంది విత్తనాలను పంపిణీ చేయడం జరిగింది. అలాగే అన్నదాత సుఖీభవ –పీఎం కిసాన్ పథకానికి సంబంధించి వెబ్ ల్యాండ్ నందు మీ ఖాతాకీ ఆధార్ అనుసంధానం జరగని రైతులు మాత్రము మీ దగ్గర లోని సచివాలయంలో గానీ లేదా మీ సేవా కేంద్రం నందు సంప్రదించి తప్పనిసరిగా అనుసందించు కోవాలని ఆయన రైతులని కోరడం జరిగింది. అదే విధంగా అన్ని రైతు సేవా కేంద్రాలలో అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ అర్హుల జాబితా అందు బాటలో ఉంచడం అయినది ఆ జాబితా లో మీ యొక్క పేరు ఉందో లేదో కూడా చూడవచ్చునని తెలిపారు. ఇంకా వివరాలు తెలుసు కొనుటకు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి సలహాలు పొందగలరని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు, గ్రామ ఉద్యానవన సహాయకురాలు శ్రీలేఖ, ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం







(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 23)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు, యువనేత కందుల విగ్నేష్‌రెడ్డి సూచనలతో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పట్టణంలోని 222 బూత్ నందు బుధవారం వార్డు కన్వీనర్ ముక్కర కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం గడిచిన ఏడాదిలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేశారు. అనంతరం వారికి ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు షేక్ కాలేషా, వార్డు కో కన్వీనర్ ఖాదర్ బాష, తదితరులు పాల్గొన్నారు.

# జవాబుదారీతనంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం

### అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయం

### సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 23)



ప్రజలకు జవాబు దారీతనంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలియజేశారు..కందుకూరు పట్టణంలోని 19 వ వార్డులో బుధవారం సాయంత్రం జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం అభివృద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో తొలి ఏడాదిలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు ఎమ్మెల్యే వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వార్డులోని ప్రతి ఇంటింటికి వెళుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు, ఏవైనా కారణాలతో ప్రభుత్వ పథకాలు రానిచో తన దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. వార్డులో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువచ్చినచో ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, సొంత స్థలం ఉండి ఇల్లును నిర్మించబడిన వారికి ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం ద్వారా ఇల్లు నిర్మిస్తామని, స్థలాలు లేనివారు ఇంటి స్థలాలు ఇప్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని, ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమంది పిల్లలకు తల్లికి వందనం, దీపం పథకం ద్వారా ప్రతి ఇంటికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, రైతుల పెట్టుబడికి సహాయం కింద అన్నదాత సుఖీభవ పథకం ద్వారా త్వరలో రైతుల ఖాతాలోకి నగదు జమ చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. ముందుగా ఈ కార్యక్రమానికి చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కి కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు అనంతరం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు సయ్యద్ సుల్తాన్, వార్డు నాయకులు దండే శ్రీనివాసరావు, ముస్తాక్, మసూద్, హర్షత్, దండే ఏడుకొండలు, మద్దిశెట్టి రవి గంటా శ్రీకాంత్ దండే సునీల్ నారిశెట్టి బాలమోహన్, తిరుమల శెట్టి ప్రసాద్, ఫాజల్ పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, ముచ్చు శ్రీను, చిలకపాటి మధు, వడ్డెళ్ళ రవిచంద్ర, షేక్ రఫీ, కొత్తూరు వెంకట సుధాకర్, అల్లం వెంకటేశ్వర్లు, గడ్డం మాలకొండయ్య, ముచ్చు వేణు, చుండూరి శ్రీను, మధిర మధు, బెల్లం వెంకటేశ్వర్లు, దివి కొండయ్య దివి శ్రీను, షేక్ రూబీ, జియావుద్దీన్, ఘట్టమనేని సుబ్బారావు, కల్లూరి శైలజ, కంసాని మయూరి, ద్రాక్షాయని, ఎస్తేరమ్మ పార్వతి, రత్తమ్మ, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.







## మండల వైసీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రారంభమైన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 23)

మండల కేంద్రమైన ఉలవపాడు దర్గా సెంటర్లో బుధవారం మండల వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో పెద్దఎత్తున బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు మేనిఫెస్టో రీకాలింగ్ మోసాలను తెలియజేస్తూ కార్యకర్తలు, నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ఈ సంవత్సర కాలంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన మేనిఫెస్టోలో హామీలను అమలు చేయకుండా చేసిన మోసాన్ని వివరిస్తూ ఒక్కొక్క కుటుంబం ఎంత నష్టపోయిందో వివరాలను సేకరించారు. ప్రతి గడపలో మహిళలు ఎదురేగి చంద్రబాబు నాయుడు చెప్పిన హామీలను నమ్మి మోసపోయామని సంవత్సరంనర అయినా కూడా మూడు సిలిండర్లో ఒక్కటే దక్కుదల తప్ప ఏమి ఒక్క పథకం అమలు కాలేదు అని ఆడబిడ్డ నిధి 1500 కు మహిళల నెత్తిన శఠకోపం పెట్టారని ఆవేదనతో తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నన్నం పోతురాజు, పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ వెలిచర్ల.ధనకోటి,జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తోకల కొండయ్య,పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్ , రాష్ట్ర పార్టీ బూత్ కమిటీ జాయింట్ సెక్రెటరీ గణేషం గంగిరెడ్డి, కందుకూరు రూరల్ మండలాధ్యక్షుడు ఈదర రమేష్, నియోజకవర్గం గ్రీవెన్స్ అధ్యక్షులు ఎరమాల నాగభూషణం, వైస్ ఎంపీపీ సయ్యద్ ఫజల్, నియోజవర్గ యూత్ అధ్యక్షుడు మద్దసాని నవీన్, నియోజవర్గ ఎంప్లాయిస్ మరియు పెన్షనర్స్ విభాగం అధ్యక్షులు మర్లపాటి ఆదాం, నియోజవర్గ ఐటీ విభాగం అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, ఎంపీటీసీ రాధామాధవి, సీనియర్ నాయకులు అమ్మనబ్రోలు బ్రహ్మయ్య, జంపని అనురాధ, చేజర్ల వెంకట్రామిరెడ్డి, నిశాంత్ రెడ్డి, రాపూరి జాలరావు, రాయపాటి శివయ్య, సీతారాంరెడ్డి, రవీంద్రారెడ్డి, అమ్మనబ్రోలు శ్రీనివాస్, చలంచర్ల శ్రీనివాసులు, సన్నిబోయిన సుధాకర్, మానం సుబ్బారావు, ఎర్రజొన్న మాధవరావు, షేక్ దస్తగిరి, తాటితోటి ప్రకాశం, సోషల్ మీడియా ఆలూరి మధు, తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి ఎండి ఫరూక్‌ను కలిసిన షేక్ రఫీ



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 23)

బుధవారం నెల్లూరులో జరిగిన డీఆర్సి సమావేశానికి ముఖ్యఅతిథిగా న్యాయశాఖ, మైనార్టీ శాఖ మంత్రి నెల్లూరు జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్ హాజరయ్యారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ సెల్ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ రఫీ మర్యాదపూర్వకంగా కలిశారు.

# బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 23)

మే నెలలో జరిగిన ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన జీతభత్యాలను రెండు నెలల నుండి అందక ఉపాధ్యాయులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు కావున ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా వారికి జీతభత్యాలను వెంటనే చెల్లించాలని ఎస్టియు జిల్లా అధ్యక్షులు కే ఎర్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం మార్కాపురం మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం అమ్మవారి పల్లి శివరాంపురం కొండేపల్లి మాల్యవంతునిపాడు భూపతి పల్లి బొందలపాడు, మిట్టమీదిపల్లి తిప్పాయపాలెం, చింతగుంట కొత్తపల్లి కోల భీముని పాడు జమ్మనపల్లి గ్రామాలను సందర్శించి ఉపాధ్యాయులచే సంఘంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల యొక్క సమస్యలను సేకరించడమైనది అందులో భాగంగా ఉపాధ్యాయులకు స్పాట్ వాల్యూయేషన్ నందు చెల్లించవలసిన రెన్యూనరేషన్ చెల్లించాలని, ఉన్నత పాఠశాలలో రిలీవర్ లేక ఇబ్బంది పడుతున్న సబ్జెక్ట్ టీచర్లను పిఎస్ హెచ్ఎంలుగా ఉన్న వారిని తాత్కాలికంగా అయినా డిప్యూటేషన్ వేసి పదవ తరగతి విద్యార్థులకు బోధనలో ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వంలో అదనపు తరగతుల నిర్మాణంలో నిలిచిపోయిన వాటిని సత్వరమే పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు సరైన వసతులను కల్పించాలని, అప్గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలో మోడల్ ప్రాథమిక పాఠశాలకు మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షులు తూంపాటి వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కె యూసఫ్, షరీఫ్, జిల్లా కౌన్సిలర్ పి అల్లూరయ్య, జిల్లా కార్యదర్శి అక్కల నారాయణ, మండల శాఖ గౌరవాధ్యక్షులు కేటి రమేష్‌లు పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com